


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 85, పేజీలు - 08

శనివారం, ఆగష్టు 30, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

## ఐఏఎస్ శ్రీలక్ష్మికి సుప్రీం కోర్టులో ఊరట

### - తెలంగాణ హైకోర్టు తీర్పుపై సుప్రీం స్టే



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ సీనియర్ ఐఏఎస్ శ్రీలక్ష్మికి సుప్రీం కోర్టులో భారీ ఊరట దక్కింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆర్డర్‌పై సుప్రీం కోర్టు స్టే విధించింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో శ్రీలక్ష్మీ పేరును తొలగిస్తూ గతంలో తెలంగాణ హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. అయితే తెలంగాణ హైకోర్టు ఆదేశాలను

2లో..

## ఉత్తరాఖండ్‌లో కుంభవృష్టి బీభత్సం

### - శిథిలాల కింద కుటుంబాలు



డెహ్రాడూన్ (ప్రశ్న న్యూస్) ఉత్తరాఖండ్‌ను కుంభవృష్టి కుదిపేసింది. రుద్రప్రయాగ్, చమోలీ జిల్లాల్లో ఆకస్మికంగా కురిసిన భారీ వర్షాల కారణంగా జనజీవనం స్తంభించిపోయింది. వరదలు, కొండచరియలు విరిగిపడటంతో పలు కుటుంబాలు శిథిలాల కింద చిక్కుకోగా, మరికొందరు

2లో..

## ఉక్రెయిన్ భారీ నౌకను నీట ముంచిన రష్యా

### - ఒకరి మృతి, పలువురు నావికులకు గాయాలు



టెహ్రాన్ (ప్రశ్న న్యూస్) ఉక్రెయిన్ పై రష్యా దాడులు కొనసాగుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వం జరిపినా రష్యా తన దూకుడు తగ్గించలేదు. తాజాగా ఉక్రెయిన్ లోని భారీ నౌకలలో ఒకటైన 'సింపరోపోల్'పై సముద్ర డ్రోన్లతో విరుచుకుపడింది. ఒడెస్సా తీరంలో మోహరించిన ఈ భారీ నౌకను రష్యా డ్రోన్ ఢీ కొట్టి పేలిపోయింది.

2లో..

# స్కూల్స్, కాలేజీల్లో ఫేషియల్ రికగ్నేషన్ తప్పనిసరి



### అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు మొదలు విశ్వ విద్యాలయాల వరకు ప్రతి విద్యా సంస్థలోనూ మెరుగైన బోధన సాగాలని విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలు మరింతగా పెంచాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రొఫెషినల్ కోర్సులు బోధించే కళాశాలల్లో విద్యార్థులు, బోధన సిబ్బందికి ఫేషియల్ రికగ్నేషన్ తప్పనిసరి చేయాలని సీఎం ఆదేశించారు. ముఖ గుర్తింపుతో హాజరు శాతం మెరుగవడంతో పాటు ప్రొఫెషనల్ విద్యా సంస్థల్లో లోటుపాట్లను అరికట్టవచ్చన్నారు. విద్యా శాఖపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. విద్యా శాఖ పరిధిలో అదనపు గదులు, వంట గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహారీల నిర్మాణం వివిధ విభాగాలు చేపట్టడం సరికాదని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ నిర్మాణాల నాణ్యతప్రమాణాలు, నిర్మాణ పర్యవేక్షణ, నిధుల మంజూరు, జవాబుదారీతనానికి గానూ ఒకే విభాగం కింద ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

### మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపును గ్రీన్ ఛానల్

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న విద్యా, సంక్షేమ వసతుల అభివృద్ధి సంస్థ కిందనే రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల నిర్మాణాలు కొనసాగాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

2లో..

# జపాన్, భారత్ కలిస్తే అద్భుతాలే

### టోక్యోలో ఇండియా-జపాన్ ఎకనామిక్ ఫోరంలో మోదీ



టోక్యో (ప్రశ్న న్యూస్) భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రపంచ దేశాలు కేవలం మన వృద్ధిని గమనించడమే కాకుండా మనపై గట్టి నమ్మకంతో ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. త్వరలోనే భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జపాన్ పర్యటనలో ఉన్న మోదీ టోక్యోలో జరిగిన ఇండియా-జపాన్ ఎకనామిక్ ఫోరంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ "ప్రస్తుతం భారతదేశంలో రాజకీయ స్థిరత్వం, ఆర్థిక స్థిరత్వం, పారదర్శక విధానాలు ఉన్నాయి.

2లో..

## ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఏపీకి లక్ష కోట్ల పెట్టుబడులే లక్ష్యం

### - ఇండియా ఫుడ్ మాన్యుఫాక్చరింగ్ సదస్సులో పాల్గొన్న సీఎం చంద్రబాబు

- దేశానికి ఫ్రూట్ కేపిటల్, ఆక్వా హబ్‌గా ఆంధ్రప్రదేశ్ ఉందన్న ముఖ్యమంత్రి
- రూ. 200 కోట్లు దాటిన ప్రాజెక్టులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇస్తామని వెల్లడి
- 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు ప్రణాళిక చేస్తున్నామన్న సీఎం
- వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్' కింద ముందుకు రావాలని యువతకు పిలుపు



విశాఖపట్నం (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌ను ఫుడ్ ప్రాసెసింగ్, ఆక్వా, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాబోయే ఐదేళ్లలో ఈ రంగాల్లో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులను సాధిస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. శుక్రవారం విశాఖలో ట్రేడ్ ప్రమోషన్

2లో..

## అసెంబ్లీ భేటీ వేళ కేసీఆర్ అనూహ్య నిర్ణయం

### - రేవంత్ రెడ్డి వాట్ నెక్స్ట్..?




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి. నేడు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో ప్రధానంగా కాళేశ్వరం పైన కమిషన్ నివేదిక ప్రభుత్వం ప్రవేశ పెట్టనుంది. దీని పైన చర్చ పార్టీల అభిప్రాయాలు తీసుకున్న తరువాత ప్రభుత్వం చర్యల పైన ప్రకటన చేసేందుకు సిద్దం అవుతోంది. కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరైన

2లో..

## హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

### - నిమజ్జనం కోసం భారీ ఏర్పాట్లు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగర ప్రజలకు ట్రాఫిక్ పోలీసుల కీలక సూచన. వినాయక నిమజ్జన కార్యక్రమం సందర్భంగా నగరంలో వారం రోజుల పాటు వాహన రాకపోకలకు ప్రత్యేక ఆంక్షలు అమలులోకి రానున్నాయి. ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 5 వరకు మధ్యాహ్నం

2లో..

## ఫలించిన చంద్రబాబు కృషి

### - కుప్పంలో కృష్ణా జలాల రాకతో సంతోషం
### - నేడు చంద్రబాబు జలహారతి



అమరావతి (ప్రశ్న న్యూస్) రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు నాడు ఎన్టీఆర్ వివిధ ప్రాజెక్టులకు శ్రీకారం చుడితే ఆయన కలను చంద్రబాబు సాకారం చేస్తున్నారు. సీమ పల్లెల్లోకి నీళ్లు పారించారు. సీమకు పూర్తి స్థాయిలో కృష్ణా జలాలు అనేవి ఇన్నేళ్లూ కల కానీ ఇప్పుడు అది నిజం. ఈ కలను చంద్రబాబు

2లో..

## తెలంగాణలో భారీ వర్షాలు

### వరదల ప్రభావంతో ధ్వంసమైన రహదారుల



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ వ్యాప్తంగా వరుణుడు ఉగ్రరూపం దాల్చడం, భారీ వర్షాలకు తోడు వాగులు ఉగ్రరూపం దాల్చడంతో అనేక గ్రామాల్లో రహదారులపై ఊహించని విధ్వంసమే జరిగింది. వరదల తాకిడికి రహదారులు కొన్ని చోట్ల ఏకంగా కొట్టుకుపోయాయంటే పరిస్దితి ఏ స్దాయిలో ఉందో అర్దం చేసుకోవచ్చు. పంచాయితీ రాజ్ శాఖ పరిధిలో అనేక చోట్ల రహదారులు కుంగిపోవడం, భారీ గోతులు పడటం, పగిలిపోవడం జరిగింది.

### రూ.374 కోట్ల నష్టం అంచనా

తాజాగా వరదలు, వర్షాల ప్రభావంతో పంచాయితీ రాజ్ శాఖ పరిధిలో రహదారులకు వాటిల్లిన నష్టం అక్షరాల 374 కోట్ల రూపాయలు. ఇదే విషయాన్ని తాజాగా ఆ శాఖ మంత్రి సీతక్కకు అధికారులు వివరించారు. ఈరోజు పంచాయితీరాజ్, ఇంజనీరింగ్

3లో..

## మోదీకి జగన్ దత్తపుత్రుడు

### - వైఎస్ వివేకా హత్య కేసుపై షర్మిల సంచలన ఆరోపణలు



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుపై ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల సంచలన వ్యాఖ్యలు చేశారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కోసమే వైఎస్ అవినాష్ రెడ్డిని కాపాడుతున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా సీబీఐ దర్యాప్తుపైనా షర్మిల విమర్శలు గుప్పించారు. వివేకా హత్య కేసుపై ఎందుకు మళ్లీ దర్యాప్తు చేపట్టవద్దని ప్రశ్నించారు. ఇక తన సోదరుడు జగన్‌పైనా షర్మిల మండిపడ్డారు. ప్రధాని మోదీకి జగన్ దత్తపుత్రుడు అని ఆమె ఆరోపించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన షర్మిల

2లో..

# తెలంగాణలో యూరియా కొరతకు చెక్

### సరఫరాపై మంత్రి తుమ్మల కీలక ప్రకటన



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రైతాంగం ప్రస్తుతం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య యూరియా కొరత. రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల కోసం సాగుతున్న క్యూలు రైతుల ఇబ్బందులను స్పష్టంగా చూపిస్తున్నాయి. ప్రతి రోజు యూరియా దొరుకుతుందన్న హామీ లేకపోవడంతో పంటల భవిష్యత్తుపై అనిశ్చితి పెరిగింది. ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం ఉన్నవారికే సరఫరా జరుగుతుండటం కౌలు రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక నిర్ణయాలు ప్రకటించారు. మంత్రి తెలిపిన వివరాల ప్రకారం వచ్చే రెండు రోజుల్లో గద్వాల్, పెద్దపల్లి, జగిత్యాల, వరంగల్, సనత్ నగర్, జడ్చర్ల, కరీంనగర్, పందిళ్లపల్లి, గజ్వేల్, మిర్యాలగూడ, నాగిరెడ్డిపల్లికి సుమారు 21,325 మెట్రిక్ టన్నుల యూరియా చేరుకోనుంది.అదనంగా సెప్టెంబర్ మొదటి వారంలో గంగవరం,

2లో..

# హైడ్రాను అభినందించిన హైకోర్టు

### - హైదరాబాద్ ను తీర్చిదిద్దడంలో హైడ్రా కృషిపై ప్రశంస




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలో అక్రమ నిర్మాణాలు, రహదారి ఆక్రమణలు, పార్కులు, నీటి వనరులపై దాడులు చాలా కాలంగా ఒక పెద్ద సమస్యగానే ఉన్నాయి. ఈ క్రమంలో హైడ్రా ఏర్పాటు కావడంతో పరిస్థితులు మారాయి. గతంలో పెద్ద నాయకులు, రాజకీయ ప్రోత్సాహం ఉన్నవారు ఆక్రమణలు చేసినా సాధారణ ప్రజలు ఏం చేయలేని స్థితి నెలకొనేది. కానీ హైడ్రా ముందుకు రావడంతో ఇప్పుడు ప్రజల్లో ధైర్యం పెరిగింది. తాజాగా పర్యావరణహితమైన నగరంగా హైదరాబాద్ను తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్న హైడ్రాను హైకోర్టు అభినందించింది. ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు,

2లో..

# ఐఏఎస్ శ్రీలక్ష్మికి సుప్రీం కోర్టులో ఊరట

సీబీఐ అధికారులు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. కేసులో మరోసారి వాదనలు విని నిర్ణయం వెలువరించాలని తెలంగాణ హైకోర్టుకు సుప్రీంకోర్టు సూచించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో వాదనల అనంతరం ఇటీవల తెలంగాణ హైకోర్టు తీర్పు వెలువరించింది. శ్రీలక్ష్మీ పేరును తొలగించడం కుదరదని ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. తెలంగాణ హైకోర్టు తీర్పుపై శ్రీలక్ష్మీ సుప్రీంకోర్టును ఆశ్రయించగా విచారణ చేపట్టిన జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ కోటీశ్వర్‌సింగ్ ధర్మాసనం తెలంగాణ హైకోర్టు ఆదేశాలపై స్టే ఇస్తూ ప్రతివాదులకు నోటీసులు ఇచ్చింది. ఐఏఎస్ వై శ్రీలక్ష్మి ఓబుళాపురం మైనింగ్ కేసులో సీబీఐ కోర్టును ఆశ్రయించారు. 2022 అక్టోబరులో ఆమె దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌ను సీబీఐ కోర్టు కొట్టేసింది. ఆమె వెంటనే ఈ తీర్పును తెలంగాణ హైకోర్టులో సవాల్ చేశారు, రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను అనుమతించిన తెలంగాణ హైకోర్టు శ్రీలక్ష్మిని ఓబుళాపురం కేసు నుంచి తప్పిస్తూ తీర్పు ఇచ్చింది. ఆ వెంటనే సీబీఐ తెలంగాణ హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టును ఆశ్రయించారు. సీబీఐ వాదనలు వినకుండా ఉత్తర్వులు ఇవ్వడం సరికాదని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ఇరుపక్షాల వాదనల్ని సుప్రీం కోర్టు పరిగణలోకి తీసుకుని ఈ పిటిషన్‌పై వాదనలు వినాలని హైకోర్టుకు తెలిపింది. మూడు నెలల్లో తేల్చాలని సూచించింది, అయితే ఈ కేసులో శ్రీలక్ష్మి పేరును తొలగించడం కుదరదని తేల్చింది. మళ్లీ శ్రీలక్ష్మి సుప్రీంకోర్టుకు వెళ్లి తెలంగాణ హైకోర్టు తీర్పుపై తాజాగా స్టే తెచ్చుకున్నారు.మరోవైపు ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో గాలి జనార్దన్ రెడ్డికి ఊరట లభించింది. తెలంగాణ హైకోర్టు ఆయనకు, ఆయన పీఏ అలీఖాన్, బీవీ శ్రీనివాస్ రెడ్డి, రాజగోపాల్‌కు బెయిల్ మంజూరు చేసింది. నాంపల్లి సీబీఐ కోర్టు గతంలో వీరికి విధించిన 7 ఏళ్ల జైలు శిక్షను హైకోర్టు కొట్టివేసింది. అయితే, దేశం విడిచి వెళ్లకూడదని, రూ.10 లక్షల పూచీకత్తు సమర్పించాలని షరతు విధించింది. దాదాపు 15 ఏళ్లుగా నడుస్తున్న ఓబుళాపురం మైనింగ్ కేసులో విచారణ జరగ్గా నాంపల్లి కోర్టు తీర్పు వెలువరించింది. బి.వి.శ్రీనివాస రెడ్డి, గాలి జనార్దన్ రెడ్డి, వి.డి. రాజగోపాల్, మెఫజ్ అలీఖాన్లకు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధించింది. ప్రభుత్వ ఉద్యోగి అయిన రాజగోపాల్‌కు అదనంగా నాలుగు సంవత్సరాల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించింది.

# ఉత్తరాఖండ్‌లో కుంభవృష్టి బీభత్సం

గల్లంతయ్యారు. అనేక ఇళ్లు, వంతెనలు ధ్వంసమయ్యాయి. చమోలీ జిల్లా దేవల్ ప్రాంతంలోని మోపటాలో జరిగిన ఘటనలో తారా సింగ్, ఆయన భార్య గల్లంతయ్యారని అధికారులు తెలిపారు. ఇదే ప్రాంతంలో విక్రమ్ సింగ్ దంపతులు గాయపడ్డారు. వారి పశువుల పాక కూలిపోవడంతో దాదాపు 15 నుంచి 20 పశువులు మృత్యువాత పడ్డాయి. రుద్రప్రయాగ్ జిల్లాలో పరిస్థితి తీవ్రంగా ఉంది. అలకనంద, మందాకిని నదులు సంగమ స్థానం వద్ద ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. కేదార్‌నాథ్ లోయలోని లవారా గ్రామంలో మోటారు రోడ్డుపై ఉన్న ఒక వంతెన వరద ఉద్ధృతికి కొట్టుకుపోయింది. రుద్రప్రయాగ్‌లోని ప్రసిద్ధ హనుమాన్ ఆలయం పూర్తిగా నీట మునిగింది. నదీ జలాలు నివాస ప్రాంతాల్లోకి చేరడంతో అధికారులు ప్రభావిత ప్రాంతాలలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.ఈ ఘటనలపై ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. స్థానిక యంత్రాంగం యుద్ధప్రాతిపదికన సహాయక, పునరావాస చర్యలు చేపడుతోందని ఆయన ఎక్స్ వేదికగా తెలిపారు. తాను ఉన్నతాధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నానని, సహాయక కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశానని చెప్పారు. మరోవైపు, బసుకేదార్ తహసీల్‌లో నాలుగు ఇళ్లు కొట్టుకుపోయినప్పటికీ, నివాసితులందరినీ సురక్షితంగా తరలించామని, ఎవరూ గల్లంతు కాలేదని రుద్రప్రయాగ్ జిల్లా మేజిస్ట్రేట్ ప్రతీక్ జైన్ స్పష్టం చేశారు. భారీ వర్షాల కారణంగా హల్ద్వానీ-భీమ్‌తాల్ రహదారిపై రాణి బాగ్ వంతెన సమీపంలో కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో, రుద్రప్రయాగ్, బాగేశ్వర్, చమోలీ, హరిద్వార్, పితోరాగఢ్ జిల్లాల్లో అధికారులు పాఠశాలలకు సెలవు ప్రకటించారు.

# ఉక్రెయిన్ భారీ నౌకను నీట ముంచిన రష్యా

దీంతో నౌక సముద్రంలో మునిగిపోయింది. ఈ దాడికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. రష్యా దాడిని ఉక్రెయిన్ కూడా ధ్రువీకరించింది. ఈ ఘటనలో ఒక నావికుడు చనిపోయాడని, మరికొందరు గాయపడ్డారని వెల్లడించింది. సముద్రంలో గల్లంతైన వారిని కాపాడేందుకు రెస్క్యూ కొనసాగిస్తున్నట్లు పేర్కొంది. 2019 తర్వాత ఉక్రెయిన్ నావికాదళంలోకి ఎంట్రీ ఇచ్చిన భారీ నౌక 'సింపరోపోల్'ను రష్యా డ్రోన్లు కూల్చేశాయి. కీవ్ లోని రెండు డ్రోన్ల తయారీ కేంద్రాలపైనా రష్యా క్షిపణి దాడి చేసిందని ఉక్రెయిన్ రాజకీయ నాయకుడు ఇగార్ జింకెవిచ్ పేర్కొన్నారు.

# జపాన్, భారత్ కలిస్తే అద్భుతాలే

ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ మనదే" అని స్పష్టం చేశారు. దేశంలో పెట్టుబడులు కేవలం పెరగడమే కాకుండా, అవి రెట్టింపు అవుతున్నాయని ఆయన వివరించారు. భారత్, జపాన్ మధ్య భాగస్వామ్యం కేవలం వ్యూహాత్మకమే కాదని, అదొక స్మార్ట్ బంధమని ప్రధాని అభివర్ణించారు. ఈ రెండు దేశాల కలయిక ఆసియా శతాబ్దంలో స్థిరత్వం, వృద్ధి, శ్రేయస్సును నిర్దేశిస్తుందని ఆయన అన్నారు. సాంకేతిక రంగంలో భారత్, జపాన్ కలిసి పనిచేసే అవకాశాలపై మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ఏఐ, సెమీకండక్టర్లు, క్వాంటం కంప్యూటింగ్, బయోటెక్, అంతరిక్ష రంగాల్లో భారత్ ఎంతో ధైర్యమైన, ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమాలు చేపట్టింది. జపాన్ సాంకేతికత, భారత ప్రతిభావంతుల మేధస్సు కలిస్తే ఈ శతాబ్దపు సాంకేతిక విప్లవానికి నాయకత్వం వహించవచ్చు" అని మోదీ తెలిపారు. ఈ రెండు దేశాల ఉమ్మడి ప్రయోజనాలు ఉమ్మడి శ్రేయస్సుగా మారాయని, జపాన్ వ్యాపారాలకు భారత్ ఒక మంచి వేదిక అని ఆయన పేర్కొన్నారు.

# స్కూల్స్, కాలేజీల్లో ఫేషియల్ రికగ్నేషన్ తప్పనిసరి

ఈ సంస్థకు అవసరమైన ఇంజినీరింగ్, ఇతర సిబ్బందిని ఇతర విభాగాల నుంచి వెంటనే డిప్యూటేషన్‌పై తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపును గ్రీన్ ఛానల్‌లో చేపట్టాలని ఈ విషయంలో ఎటువంటి అలసత్వం చూపొద్దని సీఎం అన్నారు. తెలంగాణలోని మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

### కాంట్రాక్ట్ పద్ధతిన వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలి

కంటైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలని.. కంటైనర్లపైన సోలార్ ప్యానెళ్లతో అవసరమైన విద్యుత్ వినియోగించుకోవచ్చని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.

అవసరమైతే కాంట్రాక్ట్ పద్ధతిన వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను సీఎం ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులకు సంబంధించిన బిల్లులు తక్షణమే విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని బాలికలకు వివిధ అంశాలపై కౌన్సెలింగ్ ఇచ్చేందుకు మహిళా కౌన్సెలర్లను నియమించాలని సీఎం సూచించారు. విద్యా రంగంపై పెడుతున్న ఖర్చును తాము ఖర్చుగా కాక పెట్టుబడిగా చూస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

### విద్యారంగం లోన్స్ ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో లేకుండా చూడాలి

యంగ్ ఇండియా ఇంటెగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూళ్లతో పాటు విద్యా రంగం అభివృద్ధికి తీసుకునే రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో లేకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న వారిలో 90 శాతానికి పైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలే ఉన్నారని, ఈ విషయాన్ని నిర్ధారించేందుకు గత పదేళ్లలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన వారి వివరాలపై నివేదిక రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

ఈ సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేములు శ్రీనివాసులు, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

# వాటర్ ట్యాంకర్ బోల్తా.. తప్పిన పెను ప్రమాదం

ధర్మపురి, : జగిత్యాల పట్టణంలోని 23వ వార్డు కొత్త బస్ స్టాండ్ ఔట్ గేట్ ఎదురుగా శుక్రవారం, రోడ్డుపై గుంతలో పడి మున్సిపల్ వాటర్ ట్యాంక్ బోల్తా పడింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఆ సందులో విద్యార్థులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

## ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఏపీకి

# లక్ష కోట్ల పెట్టుబడులే లక్ష్యం

కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఇండియా ఫుడ్ మాన్యుఫాక్చరింగ్ సమ్మిట్‌కు ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, వ్యవసాయ, అనుబంధ రంగాలను లాభదాయకంగా, సుస్థిరంగా మార్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. ఆహార శుద్ధి రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఈ పరిశ్రమ విలువ ప్రస్తుతం 8 ట్రిలియన్ డాలర్లుగా ఉందని, భారత్ కూడా 2030 నాటికి 700 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఈ రంగంలో భారత్ మరింత వేగంగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఆహార శుద్ధిలో ఆంధ్రప్రదేశ్ 9 శాతం వాటాతో 50 బిలియన్ డాలర్ల విలువను కలిగి ఉందని అన్నారు. అలాగే జీఎస్డీపీలో వ్యవసాయం సహా అనుబంధ రంగాల వాటా 35 శాతంతో రూ.5.19 లక్షల కోట్లుగా ఉందన్నారు. త్వరలోనే ఏపీ ఫ్రూట్ కేపిటల్ ఆఫ్ ఇండియాగా అవతరిస్తుందని, దేశంలోని ఉత్పత్తిలో 25 శాతం వాటాకు చేరుకుంటామని తెలిపారు. అదేవిధంగా 2.26 లక్షల హెక్టార్లలో ఆక్వా కల్చర్ సాగు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆక్వా హబ్‌గా ఉందని స్పష్టం చేశారు.

### ఫుడ్ ప్రాసెసింగ్ లో అవకాశాలు- ప్రోత్సాహకాలు

ఆంధ్రప్రదేశ్‌లో ఆహార శుద్ధి రంగంలో పెట్టుబడులకు అపారమైన అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. విస్తృతమైన మౌలిక సదుపాయాలు కూడా ఆంధ్రప్రదేశ్ సొంతమని పెట్టుబడిదారులు, ఎగుమతిదారులకు వివరించారు. రాష్ట్రంలో 9 ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్కులు, 17 లక్షల మెట్రిక్ టన్నుల కోల్డ్ స్టోరేజ్, 33 లక్షల టన్నుల సరకు నిల్వ చేసేందుకు గోదాములు ఉన్నాయని అన్నారు. ఆహారం, పానీయాల యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశాలు కల్పిస్తూ 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. చిత్తూరు, గుంటూరు, కోస్తాంధ్ర, విశాఖ జిల్లాల్లో పండ్లు, సుగంధ ద్రవ్యాలు, ఆక్వా, కోకో, కాఫీ క్లస్టర్లు ఉన్నాయని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0 కింద పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని, రూ.200 కోట్లకు పైగా పెట్టుబడులు దాటితే వాటిని మెగా ప్రాజెక్టులుగా పరిగణించి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామని సీఎం వెల్లడించారు. గత ఏడాది రాష్ట్రానికి ఆహార శుద్ధి రంగంలో రూ.10 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్పారు.

### ఆహారపు అలవాట్లు- మారుతున్న జీవన శైలితో పెట్టుబడులకు అవకాశాలు

ప్రజల ఆహారపు అలవాట్లు, మారుతున్న జీవనశైలితో ఆహార శుద్ధి రంగంలో అపారమైన అవకాశాలు వస్తున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. పెట్టుబడులకు ఇదే సరైన సమయమని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ రంగంలో వచ్చే ఎంఎస్ఎంఈలను కూడా ప్రోత్సహించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంపూర్ణ సహకారం అందిస్తున్నాయని అన్నారు. వన్ ఫ్యామిలి -వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమాన్ని కూడా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ఆహారం, పానీయాల రంగంలో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం ఇస్తామని అన్నారు. అగ్రిటెక్ రంగంలో బిల్ గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. ట్రేసబిలిటి, సర్టిఫికేషన్, ప్యాకేజింగ్ లాంటి సవాళ్లపై దృష్టి పెడుతున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.
మరోవైపు భారత్‌లో తయారయ్యే ఉత్పత్తులు అంతర్జాతీయ ప్రమాణాలతో గ్లోబల్ బ్రాండ్స్‌గా ఎదగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. అందమైన విశాఖ ఇప్పుడు దేశంలోనే మహిళలకు అత్యంత సురక్షితమైన నగరంగా ఖ్యాతి గడించిందన్నారు. త్వరలోనే సీ కేబుల్, డేటా సెంటర్లు కూడా విశాఖలో ఏర్పాటు కాబోతున్నాయని తెలిపారు. ఏపీలో ఆహార శుద్ధి సహా వ్యవసాయాధారిత పరిశ్రమలకు సంబంధించిన పెట్టుబడులను ప్రోత్సహించేందుకు అమరావతిలో ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చాప్టర్ ఏర్పాటు కానుండటం సంతోషదాయకమని ముఖ్యమంత్రి అన్నారు.

### ఏపీలో ఫుడ్ మాన్యుఫాక్టరింగ్‌పై చర్చలు

ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియా ఫుడ్ మాన్యుఫాక్చరింగ్ సమ్మిట్ మూడో ఎడిషన్‌లో ఏపీలో విలువ జోడించిన ఆహార ఉత్పత్తుల తయారీ, ప్రాసెసింగ్ చేసిన ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులు తదితర అంశాలపై విస్తృత చర్చ జరిగింది. ఆక్వా రంగంలో బ్రీడింగ్, నాణ్యమైన ఫీడ్, వ్యాధుల నియంత్రణ, ఎక్స్‌పోర్ట్ లింకేజిపై పారిశ్రామికవేత్తలు, నిపుణులు, పరిశోధకులు చర్చించారు. పంట ఉత్పత్తి అనంతర నష్టాల నివారణ, స్మార్ట్ కోల్డ్ చెయిన్, లాజిస్టిక్స్ సదుపాయాలపై దృష్టి పెట్టే అంశంపైనా చర్చలు జరిగాయి. డైరీ, పౌల్ట్రీ, మాంసం ప్రాసెసింగ్ యూనిట్ల ఆటోమేషన్, ఎగుమతి ప్రమాణాలపై సదస్సులో చర్చించారు. ఈ సమావేశానికి ఏపీ మంత్రులు టీజీ భరత్, డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, టీపీసీఐ ఛైర్మన్ మోహిత్ సింగ్లా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పారిశ్రామిక ప్రతినిధులు, ఆహార శుద్ధి పరిశ్రమలు, ఎగుమతిదారులు, నిపుణులు హాజరయ్యారు.

# హైడ్రాను అభినందించిన హైకోర్టు

రహదారులు, పార్కులను కాపాడేందుకు హైడ్రా వంటి సంస్థలు అవసరముందని పేర్కొంది. రహదారులపై రాకపోకలకు ఆటంకంగా నిర్మించిన వాటిని తొలగించే విషయంలో హైడ్రా అవసరముందంటూ జస్టిస్ విజయశేన్ రెడ్డి వ్యాఖ్యానించారు. రాంనగర్ మనెమ్మ గల్లీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఈ రోడ్డు ఆక్రమణపై జీహెచ్ఎంసీకి గతంలో ఫిర్యాదు చేసింది.
హైడ్రా సహకారాన్ని జీహెచ్ఎంసీ కోరింది. దీంతో హైడ్రా రంగంలోకి దిగి జమినిస్తాన్పూర్, రామ్ నగర్ క్రాస్ రోడ్స్ రోడ్డును ఆక్రమించి నిర్మించిన వాణిజ్య సముదాయాన్ని హైడ్రా తొలగించింది. దీంతో రామ్ నగర్ ప్రధాన రహదారికి వెళ్లేందుకు అవకాశం లభించింది. అయితే ఈ విషయమై రోడ్డుపై వాణిజ్య సముదాయాన్ని నిర్మించిన వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు గురువారం విచారణకు రాగా జస్టిస్ విజయశేన్ రెడ్డిపై విధంగా వ్యాఖ్యానించారు. రహదారులను ఆక్రమించేసి రాకపోకలకు ఆటంకం కలిగించే నిర్మాణాలను తొలగించడంలో హైడ్రా వంటి సంస్థలు ముఖ్యమైనవని హైకోర్టు పేర్కొంది. ఎప్పుడైనా ప్రజా ప్రయోజనాలకు లోబడి ప్రైవేట్ ప్రయోజనాలు ఉండాలని కూడా హైకోర్టు వ్యాఖ్యానించింది. ప్రజా ఆస్తులు, నీటి వనరులను కాపాడడంలో నగరం అంతటా హైడ్రా చేస్తున్న కార్యక్రమాలను హైకోర్టు ప్రశంసించింది.హైదరాబాద్‌లో అనధికారిక భవనాలు పెరగడంతో వర్షాకాలంలో రోడ్లపై నీరు నిల్వ అవుతోంది. చిన్న చిన్న గల్లీలు మూసుకుపోవడం వల్ల అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు సమయానికి గమ్యానికి చేరడంలో ఆటంకం కలుగుతోంది. అదనంగా భూగర్భ జలాలు తగ్గిపోవడం, చెరువులు మాయం కావడం కూడా ఈ అక్రమ కట్టడాల వలన జరుగుతోందని నిపుణులు సూచిస్తున్నారు. రాంనగర్ ఘటనలో హైకోర్టు తీర్పు హైడ్రా చర్యలకు పెద్ద బలాన్ని ఇచ్చింది. భవిష్యత్తులో కూడా ఇలాంటి అక్రమ కట్టడాలపై హైడ్రా తీసుకునే చర్యలకు ఇది చట్టపరమైన రక్షణగా నిలుస్తుందని అధికారులు భావిస్తున్నారు.

# తెలంగాణలో యూరియా కొరతకు చెక్

దామ్ర, కరాయికల్ పోర్టుల నుంచి 29,700 మెట్రిక్ టన్నుల సరఫరా వస్తుందని తెలిపారు. ఈ సరఫరా ఆధారంగా ఆదిలాబాద్, వరంగల్, జడ్చర్ల, గద్వాల్, మిర్యాలగూడ, సనత్ నగర్, గజ్వేల్ వంటి ప్రాంతాలకు ఎరువులు పంపిణీ కానున్నాయి. అక్కడి నుంచి జిల్లా డిమాండ్‌ను బట్టి రైతులకు సరఫరా చేస్తారు. దీనివల్ల ఈ ఏరియాలోని రైతులకు యూరియా కొరత తీరనుందన్నారు. ఇక రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక బృందాలను నియమించి, వరద ప్రభావిత మండలాల్లో పంటల నష్టాన్ని అంచనా వేసేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి రైతుల ఇబ్బందులపై పూర్తి సమాచారం సేకరించారు. ప్రభుత్వం యూరియా సరఫరా విషయంలో తగిన చర్యలు తీసుకుంటోందని, త్వరలోనే కొరత సమస్య తగ్గిపోతుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ చర్యలతో రైతాంగానికి గణనీయమైన ఉపశమనం కలుగుతుందనే ఆశ వ్యక్తమవుతోంది.

### యూరియా కొరతకు గల కారణాలు

తెలంగాణలో యూరియా కొరతకు గల కారణాలు చాలా ఉన్నాయి. ముందుగా వర్షాలు కురిసిన వెంటనే రైతులు ఒకేసారి పంటలు విత్తుతారు. దీంతో తక్కువ సమయంలోనే యూరియా డిమాండ్ విపరీతంగా పెరుగుతుంది. ఇది మొదటి కారణంగా నిపుణులు చెబుతున్నారు. యూరియా ప్రధానంగా పోర్టుల ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి వస్తుంది. గంగవరం, దామ్రా, కరాయికల్ పోర్టుల నుంచి రవాణా సమయంలో ఆలస్యం జరిగితే రాష్ట్రానికి చేరుకోవడంలో జాప్యం అవుతుంది. ఇది కూడా ఒక కారణం కావచ్చు. రవాణా లోపాలు కూడా ఉండే అవకాశం ఉంది. రైలు రేకులు, లారీలు అందుబాటులో లేకపోవడం వల్ల యూరియా నిల్వ ఉన్నా కూడా రైతుల వరకు సకాలంలో చేరదు. జిల్లాల్లో డిమాండ్‌కు తగిన విధంగా యూరియా సరఫరా లేకపోవడం కూడా కొరతకు గల కారణం కావచ్చు.

# అసెంబ్లీ భేటీ వేళ కేసీఆర్ అనూహ్య నిర్ణయం

మాజీ సీఎం కేసీఆర్ ఈ సమావేశాల వేళ పార్టీ ముఖ్య నేతలతో సమావేశం అయ్యారు. కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు రేవంత్ నెక్ట్స్ స్టెప్ ఏంటనేది ఆసక్తి కరంగా మారుతోంది. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న వేళా తొలి రోజు అసెంబ్లీలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మండలిలో మాగం రంగారెడ్డికి సంతాపం ప్రకటించి సభకు వాయిదా వేయనున్నారు. ఆ తరువాత బీఏసీ సమావేశం లో సమావేశ అజెండా సభను ఎన్ని రోజుల నిర్వహించాలనేది నిర్ణయం తీసుకోనున్నారు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టు పైన ప్రభుత్వం బీఆర్ఎస్ ను ఇరకాటంలోకి నెట్టేందుకు అసెంబ్లీ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలని భావిస్తోంది. ఈ సమయంలోనే ఇదే రిపోర్టు సభలో చర్చ గురించి మాజీ మంత్రులు హరీష్, కేటీఆర్ తో సహా పార్టీ ముఖ్య నేతలతో కేసీఆర్ సమావేశమయ్యారు. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ నేతలకు గులాబీ బాస్ దిశానిర్దేశం చేసారు. అసెంబ్లీలో కాళేశ్వరం కమిషన్ నివేదికపై చర్చించేందుకు తమకు తగినంత సమయం ఇవ్వాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేయనున్నారు. అసెంబ్లీలో కాళేశ్వరం కమిషన్ నివేదిక పెట్టడానికి ముందే తమకు రిపోర్ట్ ఇవ్వాలని బీఆర్ఎస్ నేతలు సూచించారు. ఇప్పటికే అసెంబ్లీ సెక్రటరీని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కలిశారు. ఇంకోవైపు ఎప్పటిలానే అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ దూరంగా ఉంటారా అనే ప్రశ్నల వేళ, కేసీఆర్ సభకు వచ్చే అవకాశం ఉందని పార్టీ నేతలు చెబుతున్నారు. సభలోనే కాళేశ్వరం పైన సమాధానం చెప్పకపోతే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని ఆ ప్రాజెక్టు ద్వారా జరిగిన ప్రయోజనాలను వివరిస్తూనే.. ఆరోపణలకు సమాధానం ఇవ్వాలని కేసీఆర్ డిసైడ్ అయినట్లు సమాచారం. దీంతో, కేసీఆర్ సభకు వస్తే, సీఎం రేవంత్ టీం ఎలాంటి వ్యూహాల తో సిద్దం అవుతోంది సభలో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయనేది ఆసక్తి కరంగా మారుతోంది.

# హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

3 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టనున్నారు. జాయింట్ సీపీ జోయల్ డేవిస్ ప్రకటన ప్రకారం ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాలు నిమజ్జన ప్రధాన కేంద్రాలుగా మారనున్నాయి.

ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, పీవీఎన్ఆర్ మార్గ్‌ల వద్ద విగ్రహాల నిమజ్జనం జరగనుండటంతో భారీ వాహనాల రద్దీ ఏర్పడే అవకాశం ఉంది. అందువల్ల పలు ప్రధాన రహదారుల్లో వాహనాల ప్రవేశంపై నియంత్రణ అమలు చేస్తారు. సెయిలింగ్ క్లబ్ జంక్షన్, తెలుగు తల్లి ఫ్లైఓవర్, కవాడిగూడ ఎక్స్ రోడ్, డీబీఆర్ మిల్స్, నల్లగుట్ట బ్రిడ్జి, బుద్ధ భవన్, వీవీ విగ్రహం ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయి. అత్యవసర పరిస్థితులు తప్ప మిగతా సమయాల్లో వాహనదారులు లిబర్టీ, ఖైరతాబాద్, పంజాగుట్ట, సికింద్రాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ప్రత్యామ్నాయ రూట్లు ఎంచుకోవాలని అధికారులు సూచించారు. అదనంగా, బేగంపేట్, మినిస్టర్ రోడ్, కవాడిగూడ వైపు వచ్చే వాహనాలు ప్రత్యేక మార్గాల ద్వారా మళ్లించనున్నారు.

### రహదారులపై పర్యవేక్షణ..

నగరంలోని ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్, అప్పర్ ట్యాంక్‌బండ్ వద్ద వాహన నియంత్రణ అమలు చేసి అవసరాన్ని బట్టి కఠిన ఆంక్షలు విధిస్తారు.భారీ సంఖ్యలో భక్తులు పాల్గొనడంతో వాహనదారులు ముందస్తుగా మార్గాలపై అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. ఈ సమయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనకుండా అదనపు సిబ్బందిని నియమించి, రహదారులపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ నిర్వహించనున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్ 90102 03626 ద్వారా సహాయం పొందవచ్చని అధికారులు స్పష్టం చేశారు. నగరంలో సజావుగా నిమజ్జనం జరిగేలా ట్రాఫిక్ విభాగం సమగ్ర ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. పోలీసులకు భక్తులు సహకరించాలని కోరారు

# ఫలించిన చంద్రబాబు కృషి

నిజం చేశారు. అతి తక్కువ వర్ష పాతం ఉండే సీమ జిల్లాల్లో నీళ్లతోనే సీమ ప్రజల స్థితిగతులు మారుతాయని ఇరిగేషన్ కు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. ఈ క్రమంలో హంద్రీ నీవాకు ఉమ్మడి రాష్ట్రంలో 1999 జులై 9 చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ రోజు బీడు భూముల్లో నీళ్లు పారేలా చేశారు. ఇదంతా రాత్రికి రాత్రి ఇది జరగలేదు. 2014 నుంచి నేటి వరకు ప్రభుత్వం భారీ ఎత్తున సాగునీటి ప్రాజెక్టులపై నిధుల ఖర్చు చేయడం వల్ల నేడు హంద్రీనీవా నీళ్లు చిత్తూరు జిల్లాలో చివరి ఆయకట్టు భూములకు చేరాయి.

### హెచ్ఎన్ఎస్ఎస్ కు నాడు అత్యంత ప్రాధాన్యం

హంద్రీనీవా ప్రాజెక్టుపై 2014-19 మధ్య రూ.4,183 కోట్లు ఖర్చు పెట్టి చంద్రబాబు ప్రాజెక్టును పరుగులు పెట్టించారు. 2019లో అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు గ్రహణం పట్టించింది. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ సీజన్‌లో ఎలాగైనా నీళు ఇవ్వాలని లక్ష్యంతో పనుల్లో వేగం పెంచారు. రికార్డు స్థాయిలో కేవలం 100 రోజుల్లో మెయిన్ కెనాల్ విస్తరణ, లైనింగ్ పనులు పూర్తి చేసి ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 3850 క్యూసెక్కులకు పెంచారు.

### సాగు బాగుంటేనే.. రాష్ట్రం బాగుంటుంది

సాగు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడూ చెబుతారు. చెప్పడమే కాదు, దాన్ని చేసి చూపించాలన్న సంకల్పంతోనే రికార్డు స్థాయిలో చేపట్టిన హంద్రీ-నీవా కాల్వ విస్తరణ పనులతో సీమకు జలకళ వచ్చింది. ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తంగా 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందుతోంది. విస్తరించిన కాల్వల ద్వారా పరుగులు పెడుతున్న కృష్ణమ్మ 19 నియోజకవర్గాలను తాకింది. 10 రిజర్వాయర్‌లను నింపుతోంది. కర్నూలు జిల్లాలో కృష్ణగిరి, పత్తికొండ, అనంతపురం జిల్లాలో జీడిపల్లి, పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లు నిండాయి. సత్యసాయి జిల్లాలో మారాల, గొల్లపల్లి, చెర్లోపల్లి, అన్నమయ్య జిల్లాలోని శ్రీనివాసాపురం, అడవిపల్లి రిజర్వాయర్లు నిండుతున్నాయి. అలాగే గాజుల దిన్నెకు నీరు చేరింది.

### చిత్తూరు సస్యశ్యామలం

హంద్రీనీవా ఆయకట్టులో చిట్ట చివరి జిల్లా చిత్తూరు. చిత్తూరు జిల్లాలో 16 లక్షల ఎకరాల సాగుభూమి ఉన్నా కేవలం 6 లక్షల ఎకరాలకే సాగునీరు అందుతోంది. మిగిలిన 10 లక్షల ఎకరాలకు సాగునీరిస్తే రైతన్నకు నీటి కొరతే ఉండదు. హంద్రీనీవా రెండో దశ పనులు పూర్తి చేసి జిల్లాలోని 2.20 లక్షల ఎకరాలకు సాగునీరు ప్రభుత్వం ఇవ్వనుంది. చిత్తూరు జిల్లాలో సాగు అంతా బోర్లపైనే ఆధారపడి ఉంది. 565 కి.మీ. మేర ఉన్న పుంగనూరు, నీవా, తంబళ్లపల్లి, కుప్పం, చింతపర్తి, ఎల్లుట్ల, వాయల్పాడు, సదుం బ్రాంచ్ కాలువలతో 1,86,500 ఎకరాలకు సాగునీరు అందుతుంది. పీలేరు, పుంగనూరు, చంద్రగిరి, పూతలపట్టు, చిత్తూరు, జీడీ నెల్లూరు నియోజకవర్గాల ప్రజలకు దీంతో ప్రయోజనం కలుగుతుంది.

### పరమ సముద్రానికి కృష్ణా జలాలు

గత నెల 17వ తేదీన కర్నూలు జిల్లా మల్యాల ఎత్తిపోతల నుంచి నీటిని విడుదల చేశారు. నాటి నుంచి హంద్రీనీవా కాలువల్లో ప్రవహించిన కృష్ణమ్మ 738 కి.మీ ప్రయాణించి కుప్పానికి చేరింది. పరమ సముద్రంలో సిఎం చంద్రబాబు కృష్ణా జలాలకు హారతి ఇవ్వనున్నారు. తరలి వచ్చిన కృష్ణమ్మ కుప్పం నియోజకవర్గంలో ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారు. జల హారతి కార్యక్రమం కోసం కుప్పం వెళుతున్న సిఎం వారి సంతోషాన్ని పంచుకోనున్నారు.

### కుప్పం బ్రాంచ్ కెనాల్

215 క్యూసెక్కుల సామర్థ్యంతో 123 కి.మీ. పొడవున కుప్పం బ్రాంచ్ కెనాల్ నిర్మించారు. రూ.197 కోట్లతో కాలువ లైనింగ్ పనులు పూర్తి చేశారు. పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని 8 మండలాల్లో ఈ కాలువ వెళ్తుంది.

ఈ కాలువ ద్వారా 4 లక్షల జనాభాకు తాగునీరు ఇవ్వడమే కాకుండా 110 చెరువులు నింపడం ద్వారా 6,300 ఎకరాల స్థిరీకరణ జరుగుతుంది. ప్రభుత్వ చిత్తశుద్ధి సంకల్పంతో 40 టిఎంసిల నీటిని ఒక్క హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా రాయల సీమ జిల్లాలు వినియోగించుకోనున్నాయి. చెరువుల అన్ని నింపే కార్యక్రమాన్ని ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించింది. దీంతో సీమలో భూగర్భ జలాలు పెరగనున్నాయి. ఉద్యాన పంటల ఉత్పత్తులు పెంచేందుకు సాగునీటి సౌకర్యం ఎంతో దోహదం చేయనుంది. ఈ ప్రాంత రైతులు, ప్రజల జీవన ప్రమాణాలు కూడా పెరగనున్నాయి.

# మోదీకి జగన్ దత్తపుత్రుడు

వివేకా హత్య విషయంలో మళ్లీ దర్యాప్తు ఎందుకు చేపట్టవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వై నాట్ అంటూ నిలదీశారు. తన సోదరి, వైఎస్ వివేకానంద రెడ్డి కుమార్తె వైఎస్ సునీత అప్పటి నుంచి ఇప్పటివరకు ఒకటే పోరాటం చేస్తున్నారని అయినప్పటికీ ఇంతవరకు న్యాయం జరగలేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సునీత చేస్తున్న పోరాటంలో న్యాయం ఉందని షర్మిల తెలిపారు. వైఎస్ జగన్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి దత్తపుత్రుడు అంటూ ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సీబీఐ సంస్థ ప్రధాని మోదీ చేతిలో కీలు బొమ్మ అని వైఎస్ జగన్ కోసం మోదీ సీబీఐ గొంతును నొక్కేశారని ఆరోపించారు.ఇక వైఎస్ జగన్ కోసం అవినాష్ రెడ్డిని కూడా కాపాడుతున్నారంటూ వైఎస్ షర్మిల తీవ్ర ఆరోపణలు చేశారు. నిజంగా సీబీఐ అధికారులు ఈ కేసులో న్యాయం గెలిపించాలి అని అనుకుంటే దోషులకు ఎప్పుడో శిక్ష పడేదని పేర్కొన్నారు. వైఎస్ వివేకా హత్య కేసులో అన్ని ఆధారాలు లభించాయని గూగుల్ మ్యాప్ లొకేషన్లు కూడా ఉన్నట్లు తెలిపారు. వైఎస్ వివేకా హత్య జరిగిన సమయంలో సంఘటనా స్థలంలోనే అవినాష్ రెడ్డి ఉన్నాడని వాటికి సంబంధించిన సాక్ష్యాధారాలు కూడా ఉన్నాయని షర్మిల సంచలన ఆరోపణలకు తెరతీశారు. అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ వైఎస్ వివేకా హత్య కేసులో ఇప్పటివరకు న్యాయం ఎందుకు జరగడం లేదని షర్మిల ప్రశ్నించారు. సీబీఐ అధికారులు చేసిన విచారణ సరిగా లేదంటూ వైఎస్ సునీత చేసిన ఆరోపణలు నిజమైనవని పేర్కొన్నారు.

## జీపీల్లో పారిశుధ్య పనులకు రూ. 2లక్షలు



ఖమ్మం, : గ్రామపంచాయతీల్లో నిధుల కొరతతో బ్లీచింగ్ పౌడర్ కూడా కొనలేని పరిస్థితి నెలకొనడం, వర్షాలతో పారిశుద్ధ్య సమస్య ఏర్పడి వ్యాధులు వ్యాప్తి చెందుతున్నందున ప్రభుత్వం స్పందించింది. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మండలానికి రూ.2 లక్షల చొప్పున నిధులు విడుదల చేసింది. ఈ నిధులను మండల పంచాయతీ అధికారి పర్యవేక్షణలో జీపీల అవసరాలకు అనుగుణంగా బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు, తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్, ఫాగింగ్ కు వినియోగించాలని సూచించారు.

## గ్రామపంచాయతీల్లో
# ఓటర్ల ముసాయిదా ప్రకటన

మధిర, : ఖమ్మం జిల్లాలోని 571 గ్రామపంచాయతీల్లోని 5,214 వార్డులకు సంబంధించి ఓటర్ల ముసాయిదా జాబితాలను అధికారులు విడుదల చేశారు. ఈ జాబితా ప్రకారం, జిల్లాలో మొత్తం 8,02,690 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 3,88,244 మంది పురుషులు, 4,14,245 మంది మహిళలు, మరియు 22 మంది ఇతరులు ఉన్నారు. గ్రామాల్లోని ఓటర్లు ఈ జాబితాను పరిశీలిస్తూ రిజర్వేషన్లపై అంచనాలు వేసుకుంటున్నారు.

## బ్రాహ్మణ బజార్‌లో మహిళలచే
# ఘనంగా కుంకుమ పూజలు



వైరా, : ఖమ్మం నగరం 26 డివిజన్ బ్రాహ్మణ బజార్ (వేదభూమి)లో శుక్రవారం ఉదయం 11 గంటలకు మహిళలు ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ సొలసా దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో గణపతి పూజతో ప్రారంభించి, లలితా అమ్మవారికి సహస్ర నామాలలో కుంకుమ పూజ, నీరాజన మంత్రపుష్పములు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్తి విశాలాక్షి, గూడూరు లలిత, గూడా మాధవి, సన్నిదానం జ్యోతి తదితర మహిళలు పాల్గొన్నారు.

## 5న మహిళా అభ్యర్థులకు అగ్నివీర్ ర్యాలీ

పాలేరు, : ఖమ్మం జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి తెలిపిన వివరాల ప్రకారం, వచ్చే నెల 5వ తేదీన చెన్నై తాంబరంలోని ఎయిర్ మెన్ సెలక్షన్ సెంటర్లో వైమానిక దళంలో చేరేందుకు ఆసక్తి ఉన్న మహిళల కోసం అగ్నివీర్ ర్యాలీ నిర్వహించబడుతుంది. ఈ ర్యాలీ ద్వారా వైమానిక దళంలో క్లరికల్, టెక్నికల్ క్యాడర్లలో ఉద్యోగావకాశాలు లభిస్తాయి. అవివాహితులైన, ఇంటర్ లేదా మూడేళ్ల డిప్లొమా ఇంజనీరింగ్ కోర్సు పూర్తిచేసిన మహిళలు అర్హులు. పాల్గొనేవారికి కనీసం 152 సెం.మీ. ఎత్తు ఉండాలి మరియు వయస్సు 17 1/2 నుంచి 21 ఏళ్ల లోపు ఉండాలి.

## మైనారిటీల సమస్యలు తీర్చాలని
# ఎమ్మెల్యేకు వినతి

సత్తుపల్లి, : వైరా నియోజకవర్గం సింగరేణి మండలంలోని మైనారిటీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల మైనారిటీ నాయకులు శుక్రవారం వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ, మైనారిటీల సమస్యలను తీర్చడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి హనీఫ్, షాది ఖానా చైర్మన్ షేక్ షఫీ, కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి, యువ నేత షేక్ మజీద్ పాషా (షేరు), షేక్ సైఫ్ పాల్గొన్నారు.

# అదుపు తప్పి కారు బోల్తా
## నలుగురికి తీవ్ర గాయాలు

నర్సంపేట, : వరంగల్ జిల్లా ఖానాపురం మండలం చిలకమ్మనగర్ సమీపంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. నర్సంపేట నుండి కొత్తగూడ వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడటంతో ములుగు జిల్లాకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వారిని బయటకు తీసి, పోలీసులకు సమాచారం అందించారు. అంబులెన్స్ ద్వారా బాధితులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

## జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో
# యువతి అనుమానాస్పద మృతి..

భూపాలపల్లి, : కాటారం-భూపాలపల్లి జాతీయ రహదారి ప్రాంతంలో ఒడితల గ్రామానికి చెందిన కప్పల వర్షిణి అనే యువతి మృతదేహం లభ్యమైంది.

యువతి ఆధార్ కార్డు ఘటనా స్థలంలో దొరికింది. ఈ నెల 6న చిట్యాల పీఎస్ లో మిస్సింగ్ కేసు నమోదైనట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. మృతదేహం వద్ద పసుపు, కుంకుమ, నిమ్మకాయలు లభించడంతో, క్షుద్ర పూజలు చేసి యువతిని బలిచ్చారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## తహశీల్దార్ నాగేశ్వరరావు ఇంట్లో ఏసీబీ సోదాలు

మహబూబాబాద్, : ఖిలా వరంగల్ తహశీల్దార్ బండి నాగేశ్వరరావు ఇంటిపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు దాడులు నిర్వహించారు. ప్రాణాల నగర్లోని ఆయన నివాసంలో ఉదయం నుంచి సోదాలు జరుగుతున్నాయి. గతంలో హసన్పర్తి, కాజీపేట మండలాల్లో పనిచేసినప్పుడు కూడా నాగేశ్వరరావుపై ఆరోపణలున్నట్లు సమాచారం.

## గార్ల రైతు వేదికలో
# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



డోర్నకల్, : గార్ల రైతు వేదికలో ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా లబ్ధిదారులకు ముఖ్య మంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) చెక్కులను పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్య క్రమంలో తహసీల్దార్ శారద, ఎంఎంపిడిఓ మంగమ్మ, సొసైటీ చైర్మన్ దుర్గ ప్రసాద్, మాజీ జడ్పీటీసీ రూప్సు లక్ష్మీ బాయి, మాజీ ఎంఎంపిపి మారోతి వెంకట్ లాల్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## తెలుగు భాష పరిరక్షణకు పెద్దబాలశిక్ష పంపిణీ

వరంగల్ ఈస్ట్,: హన్మకొండ జిల్లా మడికొండలోని సోషల్ వెల్ఫేర్ స్కూల్ అండ్ కాలేజ్ బాయ్స్ లో తెలుగు భాష దినోత్సవం సందర్భంగా పెద్దబాలశిక్ష పుస్తకాలు పంపిణీ చేశారు. ఇంగ్లీష్ మోజులో తెలుగు భాష కనుమరుగవుతున్న తరుణంలో, దాని పూర్వవైభవం కోసం పోలీస్ హెడ్ కానిస్టేబుల్ జి. జయరాజు ఈ కార్యక్రమం చేపట్టారు. తన చిన్ననాటి గురువు నరసింహారెడ్డి సార్ చెప్పిన మాటలను స్ఫూర్తిగా తీసుకుని, గతంలో పనిచేసిన పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో కూడా పెద్దబాలశిక్ష పుస్తకాలు అందించినట్లు ఆయన తెలిపారు.

## హన్మకొండలో మహిళ వద్ద చైన్ స్నాచింగ్

వరంగల్ వెస్ట్, : హన్మకొండలోని హంటర్ రోడ్ నంది హిల్స్ కాలనీలో శుక్రవారం ఉదయం కూరగాయలు కొనేందుకు వెళ్లిన విజయ అనే మహిళ మెడలోని బంగారు గొలుసును ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించి పారిపోయారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న సుబేదారి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## అటువైపు వెళ్లే ప్రజలకు అధికారుల హెచ్చరిక

మెదక్, : మెదక్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఏడుపాయల ఆలయం పూర్తిగా జలమయమైంది. దేవాలయం పై వరకు వరదనీరు చేరడంతో, భక్తులను ఆలయంలోకి అనుమతించడం లేదు. వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున ఎవరూ ఆలయానికి రావద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ పరిస్థితి కారణంగా స్థానిక ప్రజలు, భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## వరదల్లో చిక్కి కనిపించకుండా పోయిన రాజగౌడ్

నర్సాపూర్, : మెదక్ జిల్లా హవెలి ఘన్పూర్ మండలం రాజాపేట గ్రామానికి చెందిన రాజగౌడ్ బుధవారం వరదల్లో చిక్కుకున్నారు. చెరువు కట్ట తెగి వరద రావడంతో అతను ఆటోను వదిలేసి విద్యుత్ స్తంభాన్ని పట్టుకున్నాడు. మూడు రోజులు గడిచినా అతని ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అతని కోసం రిస్క్ టీం, పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు.

## డెంగ్యూతో పదేళ్ల బాలుడు మృతి

సిద్దిపేట, : జగదేవపూర్ మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన 10 ఏళ్ల యశ్వంత్ డెంగ్యూ జ్వరంతో బాధపడుతూ హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. గత 10 రోజుల్లో తిమ్మాపూర్, అనంతసాగర్ గ్రామాల్లో డెంగ్యూ కారణంగా ముగ్గురు యువకులు మరణించడంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి.

## బాలసాహితీవేత్త గరిపెల్లి అశోక్‌కు
# ఘన సన్మానం



గజ్వేల్,: తెలంగాణ సారస్వత పరిషత్, హైదరాబాద్ శాశ్వత కార్యవర్గ సభ్యులుగా ఎంపికైన సిద్దిపేటకు చెందిన ప్రముఖ బాలసాహితీవేత్త, సాహిత్య ప్రోత్సాకులు గరిపెల్లి అశోక్‌ను సిద్దిపేటకు చెందిన రచయితలు ఎన్నవెళ్ళి రాజమౌళి, ఉండ్రాళ్ళ రాజేశం లు సత్కరించారు. శుక్రవారం వారి నివాసంలో కలిసి సత్కరించి, హర్షం వ్యక్తం చేశారు. తెలుగు ఉపాధ్యాయులను మరియు తెలుగు సాహిత్యానికి ఎనలేని కృషి చేస్తున్న తెలంగాణ సారస్వత పరిషత్ సంస్థకు గరిపెల్లి అశోక్ శాశ్వత సభ్యులుగా స్థానం లభించడం పట్ల ఈ సన్మానం జరిగింది.

## గణేష్ లడ్డూ దొంగతనం.. కాలనీ వాసుల్లో ఆందోళన

హుస్నాబాద్,: హుస్నాబాద్ నియోజకవర్గంలోని స్నేహ సాయి నగర్ కాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సంవత్సరం, గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి వినాయకుడి లడ్డూను దొంగిలించారు. ఈ సంఘటనతో కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉత్సవాలను స్నేహ సాయి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు, ఇందులో అన్నదాన కార్యక్రమం మరియు ప్రత్యేక పూజలు కూడా ఉంటాయి.

# కలెక్టర్ వచ్చినా పరిష్కారం కాలే..
## మరోసారి రోడ్డెక్కిన రైతులు

దేవరకద్ర, : మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ మండల కేంద్రంలో యూరియా కొరతతో రైతులు శుక్రవారం రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి యూరియా కేంద్రాలను పరిశీలించి రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియా అందుబాటులో ఉంచుతామని హామీ ఇచ్చారు. అయితే, అధికారులు, ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు నెరవేరడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. తమకు యూరియా అందించే వరకు ఆందోళన విరమించేది లేదని రైతులు భూత్పూర్, మహబూబ్ నగర్ రోడ్డుపై నిరసన తెలిపారు.

# తెలంగాణలో భారీ వర్షాలు

శాఖ అధికారులతో సమీక్షణ నిర్వహించిన మంత్రి సీతక్క రహదారుల నష్టంపై వివరాలు సేకరించారు. రాష్ట్రవ్యాప్తంగాదెబ్బతిన్న రహదారుల పై ఆరా తీశారు. ముఖ్యంగా వరద తీవ్రత ఎక్కువగా ఉన్న కామారెడ్డి, మెదక్ ,సిద్దిపేట జిల్లాలలో రహదారులకు జరిగిన నష్టం, ప్రభావంతో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకూ రాష్ట్రవ్యాప్తంగా 1291 ప్రాంతాల్లో రహదారులు, కల్వర్టులు దెబ్బతిన్నట్లు అధికారులు మంత్రికి నివేదించారు. వీటి తాత్కాలిక మరమ్మత్తుల కోసం రూ.22.71 కోట్లు, శాశ్వత మరమ్మత్తుల కోసం రూ. 352 కోట్లు ఖర్చవుతుందని ప్రాథమిక అంచనా వేశారు. మొత్తంగా గ్రామీణ రహదారుల పునరుద్ధరణ కోసం రూ.374.71 కోట్లు రూపాయలు అవసరమని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా 22 గ్రామాలకు రాకపోకలు దెబ్బతినగా, వాటిలో 14 గ్రామాలకు తాత్కాలికంగా రహదారులను పునరుద్ధరించినట్లు ఆర్ అండ్ బి అధికారులు స్పష్టం చేశారు.

### రహదారుల పునరుద్ధరణ పనులపై సర్కార్ ఫోకస్

వరదలు కాస్త తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ప్రజలకు రవాణా ఇబ్బందులు లేకుండా వీలైనంత త్వరగా రహదారుల పునరుద్ధరణ పనులు చేపట్టాలని మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. రాకపోకలు పూర్తిగా దెబ్బతిన్న గ్రామాలకు యుద్ధ ప్రాతిపదికన రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలనీ సూచించారు. వర్షాలకు తడిచి కూలే ప్రమాదం ఉన్న పంచాయతీరాజ్ భవనాలను తక్షణం ఖాళీ చేయించాలని, పంచాయతీరాజ్ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, రాకపోకలకు సమస్యలు తలెత్తకుండా చర్యలు వేగంగా చేపట్టాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.మంత్రి ఆదేశాల నేపథ్యంలో ఆర్ అండ్ బి అధికారులు రహదారుల మరమత్తులపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు ,పట్టణాలకు అనుసంధానమైన రోడ్లను యుద్ధ ప్రతీపధికన మరమత్తులు చేసేందుకు సిద్ధమైయ్యారు. ఇప్పటికే అనేక గ్రామాల్లో వరద నీరు భారీగా చేరడంతోపాటు , రహదారులపై ఉన్న బ్రిడ్జిలు కుంగిపోవడం వల్ల ఊరుదాటి రాలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో తాత్కాలికంగా అటువంటి గ్రామాలకు సాధ్యమైనంత వేగంగా రహదారుల పునరుద్దరణ చేట్టాలని అధికారుల భావించారు. ఊహించని వరదల వల్ల తెలంగాణలో రహదారులకు భారీ నష్టమే వాటిల్లింది. ఇప్పటికిప్పుడు పూర్తి స్థాయి నిధుల విడుదల ఆలస్యమైయ్యే అవకాశాలు ఉండటంతో తాత్కాలిక చర్యలపై ప్రత్యేక దృష్టి సారించారు అధికారులు. రాకపోకలు ఎక్కువగా ఉండే రహదారులే మొదటి ప్రాతిపదికగా మరమత్తులు ఇప్పటికే చేపట్టారు. ఇదిలా ఉంటే తెలంగాణ వ్యాప్తంగా వరద నష్టాలపై శాఖలవారిగా మంత్రులు నివేదిక సేకరిస్తున్నారు. బాధితులను ఆదుకునేందుకు చేపట్టాల్సిన తక్షణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించారు.

## నిర్మల్ జిల్లాలో మెడికల్ క్యాంపు

నిర్మల్, : నిర్మల్ జిల్లా మెడికల్ ఆఫీసర్ ఆదేశాల మేరకు కురన్నపేట్ మొగల్పురాలో వార్డు 8 మెడికల్ హెల్త్ క్యాంప్ జరిగింది. ఏక్తా సోషల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు షేక్ ముజాహిద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ మెడికల్ క్యాంపులలో ప్రజలు పాల్గొని రోగాలను నివారించుకోవాలని సూచించారు. మార్కెట్ లోని బస్తీ దవాఖాన కూడా పునఃప్రారంభించబడింది, చిన్నపాటి జ్వరాలు, సర్ది, శరీర నొప్పులకు ప్రజలు ఇక్కడ చికిత్స పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ క్యాంప్ సభ్యులు, ఆశ వర్కర్లు, టిఆర్ఎస్ నాయకులు సంజు, ఏక్తా సొసైటీ సోషల్ మీడియా ఇన్చార్జ్ ఫాజిల్ హష్మీ పాల్గొన్నారు.

## మంచిర్యాల జిల్లాలో చిరుత పులి కలకలం

మంచిర్యాల, : రెండు రోజులుగా వేమనపల్లి మండలం అటవీ సెక్షన్ బీట్ లలో చిరుత పులి సంచరించడం స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది. శుక్రవారం, గ్రామ సమీపంలో కనిపించిన చిరుతను చూసి కుక్కలు అరవడంతో అది అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. అటవీశాఖ అధికారులు చిరుత కదలికలను పరిశీలించి, అది నిల్వాయి అటవీ రేంజ్ వైపు వెళ్ళినట్లు నిర్ధారించారు. అటవీ ప్రాంతంలోకి, పంట చేలలోకి ఒంటరిగా వెళ్ళవద్దని అధికారులు ప్రజలను ఆదేశించారు.

## మేజర్ ధ్యాన్ చంద్ స్ఫూర్తితో
# క్రీడాకారులు ముందుకు సాగాలి

ఆదిలాబాద్, : ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని ప్రాంగణంలో శుక్రవారం జాతీయ క్రీడాకారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ.. ప్రతి క్రీడాకారుడు భారత సుప్రసిద్ధ హాకీ ప్లేయర్ మేజర్ ధ్యాన్ చంద్ ను ప్రేరణగా తీసుకోవాలని సూచించారు. అనంతరం మేజర్ ధ్యాన్ చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, జాతీయ స్థాయి క్రీడాకారులను సన్మానించారు.

## ఖానాపూర్‌లో భక్తిశ్రద్ధలతో గణనాథుల పూజలు

ఖానాపూర్, : ఖానాపూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కొలువుదీరిన గణనాథులు భక్తుల పూజలు అందుకుంటున్నారు.

వినాయక చవితి పురస్కరించుకొని ఖానాపూర్ పట్టణంతో పాటు కడెం, దస్తూరాబాద్, ఇంద్రవెల్లి, జన్నారం, ఉట్నూర్, సిరికొండలతో పాటు అన్ని గ్రామాలలో ఏర్పాటుచేసిన గణనాథుల విగ్రహాలకు వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలతో ఆయా మండపాల ఆవరణలలో కుంకుమార్చన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అలాగే ప్రజలకు దాతలు అన్నదానం నిర్వహించారు. దీంతో అన్ని మండలాల్లో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది.

## ఇసుక కోసం నిరసన కేసు కొట్టివేత

ముథోల్, : నిర్మల్ జిల్లా మామడ మండలం పొంకల్ గ్రామ జామా మస్జిద్ కు ఇసుక కోసం ఎమ్మార్వో కార్యాలయంలో నిరసన కార్యక్రమం పై నమోదైన కేసును శుక్రవారం ఖానాపూర్ జెఎఫ్సిఎం కోర్టు కొట్టివేసింది. గత ప్రభుత్వం మస్జిద్ కోసం ఇసుకకు అనుమతులు ఇచ్చినా, రాజకీయ ప్రోద్బలంతో మండల అధికారులు అడ్డుకున్నారని ముస్లిం నాయకులు తెలిపారు. అప్పటి అధికారులను శాంతియుతంగా ప్రశ్నించినందుకు తమపై అక్రమ కేసు బనాయించారని, దీనిని ప్రముఖ న్యాయవాది అసిఫ్ అలీ వాదించగా కోర్టు కొట్టివేసిందని వారు పేర్కొన్నారు. ఈ కేసులో తమ కోసం నిలబడి సహకరించిన రాజురా సత్యంకు మైనార్టీ వర్గాలు కృతజ్ఞతలు తెలిపాయి.

## మామడ మండలంలో నష్టాన్ని
# అంచనా వేసిన అధికారులు

బోథ్, : నిర్మల్ జిల్లా మామడ మండలంలోని కమల్కోట్ గ్రామాన్ని మామడ తాసిల్దార్ ఎంపీడీవో సుశీల్ రెడ్డి పరిశీలించారు. గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేకుండా వర్షాల కారణంగా పాగులు, వంకలు పొర్లి పొర్లుతున్నాయి. ఎలాంటి పంట నష్టం జరిగిందో అంచనా వేయడంతో పాటు వరద ప్రభావిత ప్రాంతాన్ని చూసి ప్రజలకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మామడ తాసిల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సుశీల రెడ్డి, కమల్కోట్ మాజీ సర్పంచ్ ముత్యం రెడ్డితో పాటు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా కుంకుమార్చన పూజలు

వేములవాడ, వేములవాడ పట్టణంలో శ్రీసాయి గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం వినాయక మండపంలో నిర్వహించిన కుంకుమార్చన పూజల్లో అధిక సంఖ్యలో మహిళా మణులు పాల్గొన్నారు. ఈ పూజల్లో పాల్గొనడం ద్వారా సకల శుభాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

## ఆటలాడుకుంటూ
# నీటి గుంతలో పడి బాలుడు మృతి

జగిత్యాల, : జగిత్యాల జిల్లా రూరల్ మండలం కల్లెడ గ్రామంలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. పాఠశాలకు సెలవు రావడంతో ఇంటి వద్ద ఆడుకుంటున్న ఏడేళ్ల కుంట దినేష్ అనే బాలుడు నీటి గుంతలో పడి మృతి చెందాడు. రెండో తరగతి చదువుతున్న దినేష్, ముగ్గురు చిన్నారులతో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు గుంతలో పడిపోయాడు. స్థానికులు గమనించి వెతికినా అప్పటికే బాలుడు మరణించాడు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు.

## ఆపన్న హస్తం కోసం ఎదిరి చూస్తున్న గౌతం కుటుంబం

### గౌతం గుండె శస్త్రచికిత్స కోసం మీ సహాయం అవసరం

### దాతలకు విజ్ఞప్తి చేస్తున్న గౌతం కుటుంబ సభ్యులు



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) "ఒక చిన్న సహాయం... ఒక జీవితం నిలబెడుతుంది!" కరీంనగర్ జిల్లా,మానకొండూర్ నియోజకవర్గంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన కండె గౌతం (35) ప్రాణాలతో పోరాడుతున్నాడు. తీవ్రమైన హృదయ సమస్యతో బాధపడుతున్న గౌతం ప్రస్తుతం కరీంనగర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యులు వెల్లడించిన వివరాల ప్రకారం, అతని గుండెకు అత్యవసర శస్త్రచికిత్స తప్పనిసరి. దానికి రూ.4 లక్షల వరకు ఖర్చు అవుతుంది. కానీ సదరు గౌతం కుటుంబానికి ఈ భారీ మొత్తాన్ని సమకూర్చే స్థోమత లేదు. అతనికి భార్యతో పాటు ఒక బాబు, ఒక పాప ఉన్నారు. కూలి పనుల మీద ఆధారపడి జీవిస్తున్న ఈ కుటుంబానికి ఇప్పుడు మీలాంటి మంచి మనుషుల సహాయం అత్యవసరం.దాతలారా, మీ చిన్న సహాయం గౌతం ప్రాణాన్ని కాపాడుతుంది. దయచేసి ఈ యూపీఐ నెంబర్‌కి విరాళం అందించండి:ఫోన్ పే/గూగుల్ పే : 6303771887,8247534597 అని బాధిత గౌతం కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ దాతలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఆపదలో ఆదుకున్న లచ్చన్న - గాయపడిన రైతుకు

# రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేత

### మరోసారి మానవత్వాన్ని చాటుకున్న తూడి లచ్చన్న



గంగాధర (ప్రశ్న న్యూస్) గంగాధర మండలం, మల్లాపూర్ గ్రామానికి చెందిన కొలేపాక శంకరయ్య అనే వ్యక్తికి కాలుకి తీవ్ర గాయంతో గత నెల రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిన వెంటనే ప్రముఖ సామాజిక వేత్త, టీఎల్ యువసేన అధినేత తూడి లచ్చన్న తక్షణమే స్పందించి రూ.10,000 ఆర్థిక సహాయాన్ని టీఎల్ యువసేన సభ్యుల చేతులమీదుగా అందించారు.ఈ సందర్భంగా లచ్చన్న ఫోన్లో మాట్లాడుతూ, "ఎవరైనా కష్టాల్లో ఉంటే తోడుగా నిలవడం మనందరి బాధ్యత. శంకరయ్య త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను" అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎల్ యువసేన సభ్యులు పిట్టల మనోహర్, బైరి శ్రీధర్, రాసూరి రవీందర్, కొలేపాక వేణు, పడాల తిరుపతి,గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో మల్లాపూర్ గ్రామస్తులు లచ్చన్న దాతృత్వాన్ని అభినందించారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాం చందర్ రావు తొలి పర్యటనను జయప్రదం చేయాలి

### గంగాధర బీజేపీ సమావేశంలో

### మండలాధ్యక్షులు : పంజాల ప్రశాంత్ గౌడ్



గంగాధర (ప్రశ్న న్యూస్)గంగాధర మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మధురానగర్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మండల బీజేపీ అధ్యక్షులు పంజాల ప్రశాంత్ గౌడ్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 3న తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు రాంచంద్రరావు కరీంనగర్ జిల్లాకు తొలిసారిగా పర్యటించనున్నారని తెలిపారు. ఆ పర్యటనను విజయవంతం చేయడానికి గంగాధర మండలం నుండి భారీ ఎత్తున బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాలని పిలుపునిచ్చారు.సమావేశంలో బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే స్పందించక పోవడంతో శ్రమదానంతో కల్వర్టు పునరుద్ధరణ

### ఎమ్మెల్యే నిర్లక్ష్యంపై ఆగ్రహం

### - హై లెవెల్ బ్రిడ్జి పూర్తి చేయాలని డిమాండ్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల ప్రభావంతో స్తంభంపల్లి గంజి వాగు వద్ద తాత్కాలికంగా వేసిన కల్వర్టు రహదారి కొట్టుకుపోయింది. దీంతో రెండు రోజులుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో గ్రామస్థులే శ్రమదానానికి ముందుకు వచ్చారు. స్తంభంపల్లి,గుండన్నపల్లి గ్రామాల ప్రజలు,యువత జేసీబీ సహాయంతో కల్వర్టు పైపులను సెట్ చేసి,మట్టి వేసి రహదారిని పునరుద్ధరించారు. పైపులలో పేరుకుపోయిన చెత్త తొలగించి నీరు సజావుగా వెళ్లేలా చర్యలు చేపట్టారు."16 నెలలుగా పాదయాత్రలు, బైక్ ర్యాలీలు, ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు" అని గ్రామస్థులు మండిపడ్డారు. చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఇప్పటికైనా గంజి వాగు వద్దకు వచ్చి సమస్యను పరిశీలించి వెంటనే పనులు ప్రారంభించాలంటూ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.చిన్నపాటి వర్షానికే రాకపోకలు నిలిచిపోవడం వల్ల రైతులు, విద్యార్థులు, అత్యవసర సేవలకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే శాశ్వత పరిష్కారం చూపించాలని కోరుతున్నారు. హై లెవెల్ బ్రిడ్జి పనులు ఎందుకు అసంపూర్తిగా ఉన్నాయో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.శ్రమదాన కార్యక్రమంలో స్తంభంపల్లి మాజీ సర్పంచ్ అక్కనపల్లి జ్యోతి - కరుణాకర్, కొప్పుల మధు, అక్కెనపల్లి కళ్యాణ్, బొంగానీ అశోక్, కస్తూరి బాపురెడ్డి, అజయ్, కార్తీక్, మేడుదుల మల్లేశం, చంద్రగిరి మహేందర్, మోహన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసిన విప్ ఆది శ్రీనివాస్ - కేటీఆర్ పై ఘాటు విమర్శలు

### కాళేశ్వరం విఫలమైంది

### - బ్రిడ్జి కూడా కట్టలేని కేటీఆర్

### వర్షాలు - వరదల మధ్య రాజకీయాలెందుకు?

### - కేటీఆర్ పై విప్ ఆది ఆగ్రహం





వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణంలోని బతుకమ్మ తెప్ప వద్ద ములవాగు గంగమ్మ తల్లికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చీర, కుంకుమ, పసుపుతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "సృష్టిలో నీటి ప్రాముఖ్యత నిర్వచించలేనిది. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలు పుష్కలంగా పండాలని గంగమ్మ తల్లిని ప్రార్థించాను" అని తెలిపారు.

**ప్రాజెక్టుల స్థితిపై విమర్శలు**

తెలంగాణ రాష్ట్రంలోని అనేక ప్రాజెక్టులు భారీ వర్షాల వల్ల జలకళతో నిండిపోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కాలంలో నిర్మించిన నాగార్జునసాగర్, శ్రీరామ్ సాగర్, కడెం వంటి ప్రాజెక్టులు "ఆనాడే నిర్మించబడి ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి" అని ఆయన గుర్తుచేశారు.
దీనికి విరుద్ధంగా "లక్ష కోట్ల రూపాయలతో నిర్మించామని గొప్పలు చెప్పిన కాళేశ్వరం ప్రాజెక్టు ఈ వర్షాల్లో కృంగిపోయింది" అంటూ ఆది శ్రీనివాస్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**కేటీఆర్‌పై తీవ్ర విమర్శలు**

నర్మాల వద్ద వరదలో పలువురు చిక్కుకున్న సందర్భంలో, "కేటీఆర్ అక్కడికి వెళ్లి సహాయం చేయకుండా రాజకీయాలు మాట్లాడడం దురదృష్టకరం. ఆయన వచ్చేలోపే హెలికాప్టర్లు వచ్చి బాధితులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు" అని విప్ విమర్శించారు.అంతేకాదు, "చక్రవర్తిల రాష్ట్రాన్ని ఫామ్ హౌస్ నుంచే పరిపాలించింది మీ నాన్న కాదా? పది సంవత్సరాలపాటు మంత్రి అయినా కేటీఆర్ కనీసం బ్రిడ్జిలు కూడా నిర్మించలేకపోయారు. సిరిసిల్ల ప్రజలకు చెప్పులు కుట్టిస్తానని పెద్ద మాటలు చెప్పారు కానీ బ్రిడ్జి కట్టలేదు" అంటూ ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**కాళేశ్వరం పై చర్చకు సవాల్**

అసెంబ్లీ సమావేశాల్లో కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చ ఉండబోతోందని, "మీరు తప్పు చేయకపోతే భయం ఎందుకు? దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనండి" అంటూ కేటీఆర్‌ను సవాల్ చేశారు.
అలాగే, "గుమ్మడికాయ దొంగ ఎవరంటే భుజాలు తడుముకున్నట్లుగా కేసీఆర్, కేటీఆర్ కోర్టుకు వెళ్లి కాళేశ్వరం విచారణపై స్టే కోరారు" అని అన్నారు.

**బీసీ ఘోష్ నివేదికపై స్పందన**

విప్ మాట్లాడుతూ, "బీసీ ఘోష్ కమిషన్ నివేదికను కూడా బిఆర్ఎస్ తప్పుపడుతోంది. హరీష్ రావును పీసీ ఘోష్ కమిషన్ ఒక్కొక్కరిగా విచారించింది. బిఆర్ఎస్ పరిపాలనలో చేసినవి అన్నీ స్కాములే కాళేశ్వరం, గోర్లు, బర్లు, చేపలు ఏవీ వదల్లేదు" అని ఆరోపించారు.

## బోయిన్ పల్లి మార్కెట్లో

# రోడ్డు పై మెట్లు, జెసిబీతో తూట్లు

**ప్రభుత్వ స్థలం కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవు సెక్రటరీ**

**దొడ్డి దారి మెట్లు వద్దు,ఫ్రీ మార్గానికి గ్రీన్ సిగ్నల్..చైర్మన్**

**మార్కెట్ ఆస్తికి ఎసరు పెడితే లైసెన్స్ లు ఇక రద్దే..?**

**ఏఎంసీలో అడ్డగోలుగా భారీ వాహనాలు**

**పార్కింగ్ చేస్తే షోకాజ్ లు జారీ తప్పదు.?**

**బోయిన్ పల్లి మార్కెట్లో బయట బండ్లుకు నో ఎంట్రీ.?**







కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో నెలలో ఒకసారి వచ్చే అమావాస్య ముందు రోజు మార్కెట్లో డబల్ మార్కెట్ అవ్వడం అనవాయితీ,కానీఈ విధానం మార్కెట్ అధికారులను, అసోసియేషన్ సభ్యులను పరుగులు పెట్టిస్తున్నారు.బోయిన్ పల్లి మార్కెట్ ప్రాంగణం వద్ద నుండి మూడు వైపులా రోడ్డు కిలో మీటర్ల దూరం వరకు ట్రాఫిక్ జామ్ తో వాహనదారులు చుక్కలు చూస్తున్నారు.అది గాక మార్కెట్ కి వచ్చి పోయే ఖరీదు దారులు సైతం కంటతడి పెడుతున్నారు.దీనికితోడుగా వారి సమయం వృధా కావడం వారికి నరకం చూపిస్తుంది.ఈ నేపథ్యంలో గడిచిన ఐదు రోజుల క్రితం బోయిన్ పల్లి మార్కెట్ అధికారులు,అసోసియేషన్ సభ్యులు సంయుక్తంగా అష్టదిగ్బంధంలో ఉన్న ట్రాఫిక్ జామ్ ను కొంత మేరకు క్లియర్ చేస్తూ వారి వల్ల కూడా కాదురా బాబూ అంటూ ఆవేదనతో గొంతు పోయేవరకు రూట్ సుగుమం చేసి అలసిపోయారు.మరో పక్క మార్కెట్ బయట సైతం ట్రాఫిక్ జామ్ తో తలలు పట్టుకున్న తిరుమల గిరి ట్రాఫిక్ పోలీసులు.బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఫిర్యాదు మేరకు తిరుమల గిరి ట్రాఫిక్ పోలీసులు యుద్ధప్రాతిపదికన రంగంలోకి దిగి మార్కెట్ ప్రాంగణం ముందు చోటు చేసుకున్న ట్రాఫిక్ జామ్ ని క్లియర్ చేయడానికి మూడు గంటల సమయం పట్టింది.అలాగే వాహనదారులు ట్రాఫిక్ సిబ్బందిని శ్రమను చూసి వారిని అభినందించారు.అసలు ఈ మార్కెట్ వల్లే నిత్యం రద్దీగా బోయిన్ పల్లి మార్కెట్ ప్రాంగణం మారుతుందన్నారు.ఈ మాట ఆ నోట ఈ నోట మార్కెట్ అధికారులు,కమిటీ దృష్టికి వెళ్లడంతో, బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు,సెక్రటరీ ఎం. వేంకన్న కలిసి భవిష్యత్తులో బోయిన్ పల్లి మార్కెట్ లో ట్రాఫిక్ జామ్ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి, కార్యదర్శి ఆర్వీసీ చాంద్రారెడ్డితో చర్చించి,నూతన నిర్ణయాలతో మార్కెట్లో రంగంలో దిగారు.అసలు విషయం ఏమిటంటే బోయిన్ పల్లి మార్కెట్ సుమారు 20 ఎకరాల 23 గుంటల విస్తీర్ణంలో వ్యాపించి ఉంది.మొత్తం దుకాణాలు "175"షాపులో ఉన్నాయి.కానీఆసియాలోనే అతిపెద్ద మార్కెట్ అయిన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్.ఈ మార్కెట్ కి సుమారు సగటున ప్రతి రోజూ "28"వేల టన్నుల కూరగాయలు వివిధ రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నాయని, అమావాస్య ముందు రోజు మార్కెట్లో డబల్ మార్కెట్ అవ్వడం వల్ల కూడా మార్కెట్లో రద్దీగా మారి అందరినీ ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు.అందకనే నిన్న కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు ఆదేశాల మేరకు "బీ" మూసపేట్ లైన్ లో ఇరు దుకాణాల యజమానులు నలఫ్పై అడుగుల పొడవు ఉన్న రోడ్డును కుదిస్తు ఇరవై అడుగులగా మార్చేశారు.దీన్నిగమనించిన మార్కెట్ అధికారులు యుద్ధప్రాతిపదికన ఆ లైన్లో జేసిబి సహాయంతో ఇరువైపులాకు చెందిన మెట్లను తొలగించేశారు.ఈ క్రమంలో "టివి 44.షాపు కిర్తీశేషులు తలసాని శంకర్ యాదవ్ కు చెందినది,ఆ దుకాణానికి చెందిన మెట్లను తొలగించే సమయంలో ఒక్కసారిగా జేసిబి ముందు భాగం ఊడినంత పనైంది.అక్కడే ఉన్న అధికారులు, అసోసియేషన్ సభ్యులు షాక్ కి గురైనట్లు సమాచారం.ఏదేమైనా అధికారులు,కమిటీ నిర్ణయాలను అందరూ అభినందించారు.మరో విషయం ఏమిటంటే తొలగించిన దిమ్మల తర్వాత "బీ" మూసపేట్ లైన్ క్లియర్ కావడంతో మార్కెట్ కమీషన్ ఏజెంట్లు ఆశ్చర్యానికి లోనయ్యారు.ఎందుకంటే రెండు భారీ వాహనాలు ఒకేసారి ఆ రోడ్డులో నుంచి సాఫీగా ప్రయాణం కొనసాగించవచ్చన్నారు మార్కెట్ సెక్రటరీ ఎం వేంకన్న.ఇక ముందు ట్రాఫిక్ జామ్ కొంత మేరకు క్లియర్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు తెలిపారు.మరో విషయం సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ నిజంగా నిన్న గురువారం అధికారులు తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయం, వాటిని మేము స్వాగతిస్తూ,వారికి ప్రతి విషయంలో సహకరిస్తామన్నారు.

కార్యదర్శి ఆర్వీసీ చాంద్రారెడ్డిమాట్లాడుతూ మొన్నటి గీతలు,నిన్నటి రోడ్డు క్లియర్ రోజుకో నిర్ణయాలతో అభివృద్ధి చేస్తున్న అధికారులు, కమిటీకి మా అసోసియేషన్ నుంచి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు, సెక్రటరీ ఎం వేంకన్న, గ్రేడ్ టూ సత్యనారాయణ, అసోసియేషన్ అధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి, కార్యదర్శి ఆర్వీసీ చాంద్రారెడ్డి,అంజి, ఎన్ఎంసీ.శ్రీనివాస్,దేవేందర్,ఎంఆర్టీ రాజు,చంద్రశేఖర్, అంజయ్య,అక్షయ్,బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు డిసి.ప్రభకర్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగులో ఉన్న కేసుల దర్యాప్తును

# వేగవంతం చేయాలి

### - నాన్ బెయిలబుల్ వారంట్లను అమలు పరచాలి - జిల్లా ఎస్పీ సతీష్ కుమార్




**గుంటూరు** గుంటూరు జిల్లా, పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జూలై ? 2025 నెలకు సంబంధించిన నేర సమీక్ష సమావేశం,నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఈ సమావేశంలో గుంటూరు జిల్లాలో నమోదైన వివిధ నేరాలపై సమగ్రంగా సమీక్ష జరిపారు. దర్యాప్తు, నేర నియంత్రణ చర్యలపై పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. నాన్ బెయిలబుల్ వారంట్లు అమలు..మాదక ద్రవ్యాల నేరాలు, మహిళలపై నేరాలు, శారీరక దాడులకు సంబంధించిన కేసుల్లో పెండింగులో ఉన్న నాన్ బెయిలబుల్ వారంట్లను తక్షణమే అమలు చేయాలని ఆదేశించారు. **మిస్సింగ్ కేసులు :** తప్పిపోయిన వారి కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేసి, కుటుంబాలకు న్యాయం జరిగేలా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన నేరాలు..హత్యలు, అత్యాచారాలు, ఆస్తి సంబంధిత నేరాల కేసుల్లో దర్యాప్తును ప్రాధాన్యంగా తీసుకొని, నిర్దేశిత గడువు లోపల పూర్తి చేసి, ఛార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. కొత్త నేర చట్టాల అమలు. కొత్త నేర చట్టాల ప్రకారం నమోదు చేసిన/ప్రస్తావించిన కేసుల్లో 60 రోజులు, 90 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేయడం తప్పనిసరి అని ఎస్పీ స్పష్టం చేశారు. **వైట్ కాలర్ ర్ నేరాలు** మోసం, అధికార దుర్వినియోగం వంటి తెలుపు కాలర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు..**మాదక ద్రవ్యాల నేరాలు** గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల కేసుల్లో పదేపదే నేరాలకు పాల్పడే వ్యక్తులపై పిట్ ఎన్డీపిఎస్ చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలి.. ఈ కేసుల్లో పెండింగ్లో ఉన్న అరెస్టులను పూర్తి చేయాలి.నిందితులపై నిరంతర నిఘా పెట్టి, వారి కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలి అని తెలిపారు..

## శేర్లింగంపల్లి బిఆర్ఎస్ ఇన్చార్జి రేసులో రవి యాదవ్



శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్) శేర్లింగంపల్లి నియోజకవర్గంలో బి ఆర్ ఎస్ పార్టీకి ఇన్చార్జి నియామకంపై అధిష్టానం కసరత్తు చేస్తుండగా, ఈ రేసులో మారాబోయిన రవి యాదవ్ పేరు బలంగా వినిపిస్తోంది. గతంలో తెలుగుదేశం పార్టీ నుండి శేర్లింగంపల్లి కార్పొరేటర్‌గా పోటీ చేసిన రవి యాదవ్, ఆ తరువాత బి ఆర్ ఎస్ పార్టీలో చేరి చురుకైన కార్యకర్తగా, విశ్వసనీయ నాయకుడిగా స్థానికంగా గుర్తింపు తెచ్చుకున్నారు.రవి యాదవ్, యాదవ సామాజిక వర్గానికి చెందిన యువ నాయకుడు. శేర్లింగంపల్లి పరిధిలోని ఆయనకు బలమైన అనుబంధం ఉంది. బి ఆర్ ఎస్ పార్టీలోకి వచ్చిన తరువాత ఆయన కేవలం రాజకీయంగా కాకుండా, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా వ్యవహరించారు. పేదలకు అండగా నిలవడం, విద్యార్థులకు సహాయం చేయడం, స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపించడం ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించుకున్నారు.ఇటీవల ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కాంగ్రెస్‌లో చేరడంతో శేర్లింగంపల్లి నియోజకవర్గం బి ఆర్ ఎస్ కార్యకర్తలు నాయకత్వ శూన్యంలో నిలిచిపోయారు. ఈ నేపథ్యంలో స్థానిక నాయకత్వం అవసరమని భావించిన అధిష్టానం, స్థానికంగా బలమైన పట్టు ఉన్న రవి యాదవ్ పేరును కూడా సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు పార్టీ వర్గాల సమాచారం.అంతేకాకుండా రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీ బలంగా నిలవాలంటే స్థానికంగా ప్రజాభిమానాన్ని పొందిన, సామాజిక వర్గాల్లో , కార్యకర్తల్లో బలమున్న నాయకుడిని ఇన్చార్జిగా పెట్టడం అవసరమని అధిష్టానం భావిస్తున్నారని సమాచారం. ఈ నేపథ్యంలో రవి యాదవ్ అర్హుడిగా కనిపిస్తున్నారు.శేర్లింగంపల్లి బి ఆర్ ఎస్ ఇన్చార్జిగా రవి యాదవ్ నియమితులైతే పార్టీకి కొత్త ఊపును తీసుకువస్తారని, యువతలో ఉత్సాహం పెరుగుతుందని కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. రాబోయే రోజుల్లో అధిష్టానం తీసుకునే నిర్ణయం శేర్లింగంపల్లి రాజకీయాలపై పెద్ద ప్రభావాన్ని చూపనుంది.

# ప్రజల వద్దకే పాలనా, ప్రతి నెల “10”న..ఎమ్మెల్యే



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకి సర్కారు ప్రజల వద్దకే పరిపాలన పేరుతో దర్బార్ నిర్వహిస్తుంది.కానీసికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో మాత్రం ప్రభుత్వ సేవలు లేకపోవడంతో ఈ విషయాన్ని గమనించిన స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్.నిన్న యుద్ధప్రాతిపదికన సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రజల సమస్యల పరిష్కారానికై ప్రజల వద్దకే పాలన తీసుకురావాలని ఉద్దేశంతో త్వరలో ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీ గణేష్ తెలిపారు.కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో సీఈవో మధుకర్ నాయక్,డిఇఓ దినేష్ రెడ్డి,సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదతో ఎమ్మెల్యే శ్రీ గణేష్ భేటీ అయ్యారు.”కంటోన్మెంట్ వాణి” పేరుతో కంటోన్మెంట్ ప్రజల సమస్యలను స్వీకరించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని తలపెట్టనున్నట్లు వెల్లడించారు.అయితే కంటోన్మెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా రాబోయే సెప్టెంబర్ నుంచి ప్రతి నెల 10వ తేదీన ఉదయం 11 గంటల నుండి 2 గంటల వరకు ప్రతి మాసం ఒక వార్డును ఎంచుకొని సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాపాలన కార్యక్రమాన్ని తీసుకొచ్చి ప్రజల సమస్యలను పరిష్కరించి తగు న్యాయం చేస్తామని ఆయన పేర్కొన్నారు.కంటోన్మెంట్ ప్రజలంతా ఈ సదవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలను దరఖాస్తుల రూపంలో కంటోన్మెంట్ అధికారులకు ప్రజా ప్రతినిధులకు అందించాలని ఎమ్మెల్యే శ్రీ గణేష్ కోరారు. ఈ వేదిక వల్ల కొన్ని సమస్యలు తీరుతాయని అలాగే మరిన్ని విషయాలు నా,అధికారుల దృష్టికి వస్తాయని ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ పలు విషయాలు పంచుకున్నారు.

## కొదురుపాకలో చోరీ - 70 వేల విలువైన నగలు ఎత్తుకెళ్లిన దొంగలు

**త్వరలోనే దొంగలను పట్టుకుంటాం**

**బోయినిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ : రమాకాంత్**






బోయినపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలోని కొదురుపాక గ్రామంలో ఆగస్టు 28 అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దొంగలు రెండు ఇండ్లలో చోరీకి పాల్పడ్డారు. నాగుల లక్ష్మీ రాజం ఇంట్లో 30 తులాల వెండి కాలి పట్టీలు, ధ్యావనపల్లి సుధాకర్ రావు ఇంట్లో ఒక తులం బంగారు గుండ్లు, అర తులం కమ్మలు, 20 తులాల వెండి కాలి పట్టీలు ఎత్తుకెళ్లారు. మొత్తం విలువ సుమారు రూ.70,000గా అంచనా.సమాచారం అందుకున్న బోయినిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ రమాకాంత్ సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దొంగల కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు,త్వరలోనే దొంగలను పట్టుకుంటామని తెలిపారు.

**ప్రజలకు సూచన:** ఇళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, విలువైన వస్తువులు సురక్షిత ప్రదేశాల్లో ఉంచాలని పోలీసులు సూచించారు.

# సీపీఎస్ పెన్షన్ వద్దు పాత పెన్షన్ ముద్దు

**తెలంగాణ జేఏసీ పిలుపు**

**డైరక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ లో పోస్టర్ ఆవిష్కరణ**

**తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ టిఎంహెచ్ జి ఓ అసోసియేషన్ అధ్యక్షులు కే. శ్రీనివాస్**





రాజేంద్రనగర్ (ప్రశ్న న్యూ స్) సిపిఎస్ పెన్షన్ వద్దు పాత పెన్షన్ ముద్దు అంటూ జేఏసీ పిలుపుమేరకు డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ లో పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగిందని టీ ఎం హెచ్ జి ఓ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసులు, కార్యదర్శి సునీల్ రాజ్, టి ఎన్ జి ఓ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ సెంట్రల్ ఫారం అధ్యక్ష కార్యదర్శి కిరణ్ రెడ్డి, ఎం సత్యనారాయణ రెడ్డి, టీఎన్జీవో - డి హెచ్ వింగ్ కార్యదర్శి శ్రీహరి, నరసింహారెడ్డి, ప్రభాకర్, టి జి ఓ, టి ఎన్ జి ఓ సభ్యులు పోస్ట్రావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీనివాసులు మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తారీఖున ఆర్టీసీ కళ్యాణ మండపం, బాగ లింగంపల్లి లో నిర్వహించ తలపెట్టిన పాత పెన్షన్ సాధన పోరాట సభకు మెడికల్ హ్యాండ్ హెల్త్, టీఎన్జీవోలు, ఇతర ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై సభను జయప్రదం చేయాలని టి ఎం హెచ్ జి ఓ అధ్యక్షులు, టీఎన్జీవో అధ్యక్షులు, టీఎన్జీవో - డిహెచ్ వింగ్ అధ్యక్షులు పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా జిల్లాస్థాయి టీ జీవో, టీఎన్జీవో కార్యవర్గ సభ్యులు, ఇతర ఉద్యోగులతో కలిసి తమ తమ జిల్లా జేఏసీ నిర్వహిస్తున్న కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

## వినాయక నిమజ్జనం కోసం భారీ ఏర్పాట్లు

**గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) వినాయక నిమజ్జనం కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ తెలిపారు. గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధిలోని బీసీ కమ్యూనిటీ హాల్లో వినాయక విగ్రహాల నిమజ్జనం, ఇందిరమ్మ ఇండ్ల విషయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బారికేడ్లు, విద్యుత్ దీపాల ఏర్పాటు పై చర్చించారు. ఇదేవిధంగా సుతారిగూడ చెరువు, నారాయణ చెరువు లో పేరుకపోయిన గుర్రపు డెక్కల తొలగింపు విషయంపై చర్చించారు. ఇదేవిధంగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విషయంలో అర్హులు, అర్హులు కాని వారు ఎవరు అనే అంశంపై చర్చించారు. ఇందిరమ్మ ఇంటి ఆమోదం పొందిన వారి ఇండ్ల స్థితిగతుల గురించి చర్చించారు. ఈ సమావేశంలో గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ తో పాటు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్, గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయి పేట శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నరేందర్, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

## మానకొండూర్‌లో కవ్వంపల్లి రాజేశం పెద్దకర్మ

**కాంగ్రెస్ రాష్ట్ర నేతల నివాళులు - ప్రగాఢ సానుభూతి**



వేములవాడ / బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) మానకొండూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోదరుడు కవ్వంపల్లి రాజేశం పెద్దకర్మ (దశదిన కర్మ) కార్యక్రమం శుక్రవారం అలుగునూర్ లోని శ్రీ లక్ష్మీ నరసింహ కన్వెషన్ లో జరిగింది.ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం,రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై స్వర్గీయ రాజేశం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి,ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## వేములవాడలో గంగమ్మ తల్లికి ఘనంగా గంగపుత్రుల తెప్పోత్సవం



వేములవాడ,(ప్రశ్న న్యూస్)గత రెండు రోజులుగా వేములవాడ పట్టణం,పరిసర గ్రామాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా పట్టణంలోని మూలవాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పట్టణ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గంగపుత్రులు డప్పు చప్పుళ్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గంగాభవాని నామస్మరణతో మూలవాగులో తెప్పోత్సవాన్ని ఘనంగా జరిపారు.ఈ సందర్భంగా గంగపుత్రులు మాట్లాడుతూ, “గంగమ్మ తల్లి కరుణతో పాడి పంటలు సమృద్ధిగా పండాలని, చేపల వృద్ధి సాధించి గంగపుత్రుల ఆర్థికాభివృద్ధి కలగాలని ఆశిస్తున్నాం” అని తెలిపారు.ఈ కార్యక్రమంలో గంగపుత్ర సొసైటీ అధ్యక్షులు పంపరి శంకర్, సంఘం అధ్యక్షులు కూర పర్షయ్య, ఉపాధ్యక్షులు కూర ఎల్లయ్య, గౌరవ అధ్యక్షులు పంపరి దేవయ్య, కూర దేవయ్య, కూర జంపయ్య, సభ్యులు పంపరి అశోక్, కూర దేవేందర్, దివిటి గణేష్, పంపరి గోపాల్, మహిళా సంఘు సభ్యులు,కుల సభ్యులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో నష్ట పోయిన తెలంగాణ ప్రజలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని

**అంటు రోగాలు ప్రబలకుండా అన్ని చర్యలు తీసుకోవాలి**

**తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు చిలకమర్రి నరసింహ**



రాజేంద్ర నగర్ (ప్రశ్న న్యూస్) గతంలో ఎన్నడూ లేనంతగా వారం పది రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో తెలంగాణ రాష్ట్రంలోని రైతులు పంటలు నష్టపోయారని వారికి ప్రభుత్వం వెంటనే సర్వే చేసి నష్టపరిహారం చెల్లించాలని, అదేవిధంగా ఇల్లు కోల్పోయిన వారికి ఇల్లు మంజూరు చేయాలన్నారు.రాష్ట్రంలో భారీ వర్షాలతో రోడ్లు కొట్టకపోవడం, చెట్లు విరిగిపడడం తో ప్రయాణాలకు తీవ్ర విఘాతం కలుగుతుందని వెంటనే మెరుగుపరచాలని అదేవిధంగా విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో విద్యుత్తు లేక ప్రజలంతా అందాకారంలో జీవిస్తున్నారన్నారు. వెంటనే విద్యుత్తు మెరుగుపరచాలన్నారు, భారీ వర్షాల తో కలుషితమైన నీరు త్రాగడంతో రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఇంటికి ఒకరు చొప్పున జబ్బులు పడి ప్రభుత్వ ఆసుపత్రులు ,ప్రైవేటు ఆసుపత్రులు అనే తేడా లేకుండా తెలంగాణ రాష్ట్రంలోని వైద్యశాలలన్నీ రోగులతో కిటకిట లాడుతున్నాయని ప్రజలకు సరియైన వైద్యం కల్పించడం కోసం చర్యలు తీసుకోవాలని ఈ అతి భారీ వర్షాలతో వరదలతో బురదతో గ్రామాలకు గ్రామాలు తీవ్రమైన అంటు రోగాలు కమ్యూనికబుల్ డిసీజెస్ ప్రభ లే ప్రమాదం ఉందని కాబట్టి వైద్య ఆరోగ్యశాఖ వెంటనే అప్రమత్తమై అంటురోగాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను అని తెలిపారు.

## రాజన్న ఆలయంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా హరికథా మహోత్సవం

**శ్రీ పార్వతి కళ్యాణం హరికథ భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి**



వేములవాడ (ప్రశ్న న్యూస్) శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాల శోభలో భాగంగా వేములవాడలోని ప్రసిద్ధ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో హరికథా కార్యక్రమం శ్రద్ధాభక్తులతో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. జగిత్యాల జిల్లా నుంచి విచ్చేసిన ప్రముఖ హరికథా భాగవతార్ వి. నాగరాణి “శ్రీ పార్వతి కళ్యాణం” అనే పవిత్ర అంశంపై భక్తులకు మధురమైన హరికథ వినిపించారు. ప్రవచనంలో పరమేశ్వరుని దివ్యలీలలు, పార్వతీదేవి కళ్యాణ మహిమలు అద్భుతంగా ఆవిష్కరించారు. సంగీతం, తాత్వికత, భక్తి పరవశత కలబోతగా సాగిన ఈ హరికథ భక్తులను ఆధ్యాత్మిక లోకంలో ముంచెత్తింది. భక్తుల సమాగమం ఈ కార్యక్రమానికి భారీగా భక్తులు హాజరై పరమానందాన్ని ఆస్వాదించారు. ఆలయం ప్రాంగణం భక్తి శ్రద్ధలతో నిండిపోయింది. “ఇలాంటి హరికథలు మనసుకు ప్రశాంతి కలిగిస్తాయి” అని పలువురు భక్తులు అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా దేవస్థాన అధికారులు సమగ్ర ఏర్పాట్లు చేసి, కార్యక్రమం సజావుగా సాగేందుకు నిబద్ధతతో చర్యలు తీసుకున్నారు.

## మాజీ కౌన్సిలర్ శ్రీశైలం తండ్రి మృతి - విప్ ఆది నివాళులు - సంతాపం

**అంతిమ యాత్రలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణంలో విషాదం నెలకొంది.వేములవాడ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కూరగాయల శ్రీశైలం తండ్రి కూరగాయల పోశెట్టి అనారోగ్యంతో మృతి చెందారు.ఈ వార్త తెలిసి స్థానిక ప్రజలు, బంధుమిత్రులు, నాయకులు పెద్ద సంఖ్యలో వారి నివాసానికి చేరుకొని చివరి చూపు చూసి నివాళులు అర్పించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వ్యక్తిగతంగా హాజరై పోశెట్టి భౌతిక దేహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,“పోశెట్టి ఈప్రాంతానికి చేసిన సేవలు మరువలేనివి. వారి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటాం” అని హామీ ఇచ్చారు.తరువాత పోశెట్టి అంతిమ యాత్రలో కూడా ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. అంత్యక్రియలకు స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు,వ్యాపారవేత్తలు, పట్టణ ప్రజలు,పెద్ద సంఖ్యలో హాజరై నివాళులు అర్పించి, అంతిమ వీడ్కోలు పలికారు.

## డబ్బుల కోసం
# ఫ్లాట్ అమ్మేసిన సోనూసూద్!



సోనూసూద్ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. అభినవ దానకర్ణుడు అని చెప్పొచ్చు. కరోనా సమయంలో ప్రభుత్వాలు కూడా చేయలేని ఎన్నో పనులను తానొక్కడే, తన బృందంతో కలిసి, తన సొంత డబ్బులతో చేశాడు. కార్మికులపట్ల ఎంతో ఉదారంగా వ్యవహరించారు. ముంబయిలోని తన హొటల్ ను కరోనా బాధితులకు కేటాయించారు. ఏమాత్రం లాభాపేక్ష లేకుండా ఆక్సిజన్ సిలిండర్లను ఆసుపత్రులకు అందజేయడంతోపాటు కార్మికులను స్వస్థలాలకు పంపించేందుకు ఎన్నో రైళ్లు మాట్లాడి వారిని క్షేమంగా వారి ఊళ్లకు పంపించాడు. వాస్తవానికి సోనూసూద్ అటువంటి పనులు చేస్తుంటే అధికారంలో ఉన్న ప్రభుత్వాలే అసూయపడ్డాయి. అతను మనసుపెట్టి చేశాడు.. ప్రభుత్వాధినేతలు మాత్రం మనసు లేకుండా చేశారు. అంతే తేడా. ముంబయిలో నివాసం ఉండే సోనూసూద్ కు తెలుగులో భారీగా అభిమానులున్నారు. ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందిన ఫిష్ వెంకట్ కుటుంబానికి ఇల్లు కట్టిస్తానని హామీ ఇచ్చాడు. గతంలో తాను నిర్వహించిన అనేక సేవా కార్యక్రమాలకు ఎన్నో విలువైన ఆస్తులను అమ్మేశారు. సినిమాల్లో నటించడంద్వారా వచ్చిన డబ్బుతో వాటిని కొన్నాడు. తాజాగా సోనూసూద్ మరో లగ్జరీ ఫ్లాట్ ను అమ్మేశారు. ముంబయిలోని లోఖండ్ వాలా మినర్వా ప్రాంతంలో ఆ ఫ్లాట్ ఉంది. రూ.5.16 కోట్లకు 2012లో మహాలక్ష్మీ అపార్ట్ మెంట్ లో ఫ్లాట్ ను కొనుగోలు చేశాడు. ప్రస్తుతం దీని ధర రూ.8.10 కోట్లకు చేరుకుంది. తాను సంపాదించే సొమ్మును ఎక్కువగా రియల్ ఎస్టేట్ లోనే పెట్టుబడి పెడతాడు.

# ‘మిరాయ్’తో క్లాష్‌కు సిద్ధమేనా?




గత ఏడాది సంక్రాంతికి సూపర్ స్టార్ మహేష్ బాబు సినిమా ‘గుంటూరు కారం’ మీదే అందరి కళ్లూ నిలిచాయి. కానీ చివరికి ‘హనుమాన్’ సంక్రాంతి విజేతగా నిలిచింది. మహేష్ సినిమా మీద ఇది రెట్టింపు వసూళ్లు సాధించడం విశేషం. కంటెంట్ ఈజ్ ద కింగ్ అని రుజువు చేసిన చిత్రమది. ఆ సినిమాతో తేజ సజ్జా స్టార్ హీరో అయిపోయాడు. అవకాశాలు వెల్లువెత్తాయి. కానీ అతను మాత్రం అన్నింటినీ ఒప్పుకోకుండా ‘మిరాయ్’ చిత్రం మీద ఫోకస్ పెట్టాడు. ముందు ఇదేదో చిన్న సినిమా అనుకున్నారు కానీ.. ‘హనుమాన్’ తర్వాత తేజకు సరైన ఫాలో అప్ అనిపించేలా దీన్ని పీపుల్స్ మీడియా సంస్థ భారీగానే తీర్చిదిద్దింది. టీజర్ చూసినపుడే ఇది వేరే లెవెల్ సినిమా అనిపించింది. ఇప్పుడు ట్రైలర్‌తో సినిమా మీద అంచనాలు మరింత పెరిగాయి. మధ్యలో సినిమా ఆలస్యం అవుతుండడం.. కొత్త కంటెంట్ రాకపోవడం.. రిలీజ్ డేట్ మారడం వల్ల ‘మిరాయ్’కి హైప్ కొంచెం తగ్గింది. కానీ ట్రైలర్‌తో మళ్లీ కావాల్సిన హైప్ వచ్చేలాగే ఉంది. పైగా టీం కూడా పెద్ద ఎత్తున పాన్ ఇండియా స్థాయిలో ప్రమోషన్లు చేయడానికి రెడీ అవుతోంది. ‘హనుమాన్’ కేవలం కంటెంట్‌తోనే ఆడింది. కానీ ‘మిరాయ్’లో కంటెంట్ బలంగా కనిపిస్తోంది. అదే సమయంలో మారిన తేజ ఇమేజ్ ప్లస్ అవుతోంది. మంచు మనోజ్ విలన్ పాత్ర చేయడం దీనికి మరింత ఆకర్షణ చేకూరుస్తోంది. కాబట్టి ‘మిరాయ్’ని ఎంతమాత్రం తేలిగ్గా తీసుకునే పరిస్థితి లేదు. దీనికి పాజిటివ్ టాక్ వస్తే బాక్సాఫీస్ నంబర్లు ఆశ్చర్యపరిచేలా ఉండొచ్చు. సెప్టెంబరు 12న రావాలనుకున్న మిగతా చిత్రాలు దీన్ని చూసి కచ్చితంగా భయపడాల్సిందే.

# ఆ ట్యాగ్ వద్దన్న తేజ సజ్జా



ఒకట్రెండు హిట్లు కొట్టగానే హీరోల పేర్ల ముందు ఏదో ఒక స్టార్ అని ట్యాగ్ యాడ్ అయిపోతుంది. బ్యాగ్రౌండ్ ఉన్నా లేకపోయినా.. ఇది కామన్ అయిపోయింది ఈ రోజుల్లో. పీఆర్ బ్యాచ్‌తో సోషల్ మీడియాలో ఊదరగొట్టించుకుంటూ, బయట విపరీతమైన ఫాలోయింగ్ ఉన్నట్లు ప్రొజెక్ట్ చేసుకుంటూ జనాలకు భ్రమలు కలిగిండానికి ప్రయత్నిస్తుంటారు. ఐతే ‘హనుమాన్’తో తిరుగులేని విజయాన్ని అందుకుని.. మంచి మార్కెట్, ఫాలోయింగ్ సంపాదించుకున్న యువ కథానాయకుడు తేజ సజ్జా మాత్రం ఈ విషయంలో కొంచెం భిన్నంగానే ప్రవర్తిస్తున్నాడు. తన మాటలు, చేతలు చూస్తే అతనింకా నేల మీదే ఉన్నట్లు కనిపిస్తోంది. మిగతా హీరోల్లా స్టార్ అనిపించుకోవడానికి అతనేమీ తహతహలాడట్లేదు. పైగా తనకు ట్యాగ్‌లేమీ పెట్టొద్దని మీడియా వాళ్లనే అడుగుతున్నాడు. ‘మిరాయ్’ ట్రైలర్ లాంచ్ ప్రెస్ మీట్లో విలేకరులు తనను పాన్ ఇండియా స్టార్‌గా అభివర్ణిస్తే.. అలాంటి ట్యాగ్స్ వద్దే వద్దు అనేశాడు తేజ. ‘హనుమాన్’ సినిమా పెద్ద హిట్టయి, ఇప్పుడు ‘మిరాయ్’కి కూడా పాన్ ఇండియా స్థాయిలో బజ్ క్రియేట్ అయిందంటే అందులో తన కష్టం ఎంత ఉందో.. అదృష్టం కూడా అంతే ఉందని.. గ్రహాలు అనుకూలించబట్టే తనకు ఇలా జరిగిందని అతనన్నాడు. ఇలాంటి విషయాల్లో ఎంత ప్లాన్ చేసినా.. కాలం కలిసి రావడం కూడా చాలా కీలకమని తేజ అన్నాడు. తనకంటే అందంగా ఉన్న వాళ్లు, ప్రతిభావంతులు గల్లీకి పది మంది ఉంటారని.. కానీ అదృష్టవశాత్తూ తాను హీరోగా నిలబడగలిగానని అతనన్నాడు. ‘పాన్ ఇండియా స్టార్’ లాంటి ట్యాగ్స్ అస్సలు వద్దని.. అలా ప్రచారం చేసుకుంటే ‘అబ్బా వీడికి ఇంతుందా’ అన్నట్లు జనాలు అనుకుంటారని.. అందుకే అలాంటి వాటికి దూరంగా ఉండాలాని అనుకుంటున్నానని తేజ స్పష్టం చేశాడు.

# నా రెండు ప్రపంచాలు ఒకే చోటుకు చేరాయి..




మెగా డాటర్ నిహారిక నిర్మాతగా ఇండస్ట్రీలో రాణిస్తోంది. తన మొదటి మూవీ ‘కమిటీ కుర్రాళ్ళు’ సూపర్ హిట్ కావడంతో అమ్మడు రేంజ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. ప్రస్తుతం నిహారిక తన రెండో ప్రాజెక్ట్ మ్యాడ్ ఫేమ్ సంగీత్ శోభన్ తో చేస్తోంది. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ మూవీ వచ్చే ఏడాది విడుదల కాబోతుంది. ఇక ఈ సినిమా పనులతో పాటు నిహారిక ఓ వంటల కార్యక్రమాన్ని కూడా స్టార్ట్ చేస్తోంది. అలాగే సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్‌గా ఉంటుంది. ఈ క్రమంలో.. తాజాగా, నిహారిక ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ గుడ్ న్యూస్ ప్రకటించింది. “నా రెండు ప్రపంచాలు ఒకే చోటుకు చేరాయి. ఒకటేమో కెమెరా ముందుకు వచ్చాను.. అందుకోసం తయారయ్యాను. డ్యాన్స్ చేశాను.. చాలా సరదాగా ఉన్నాను. మరొకటేమో నా ప్రొడక్షన్ హౌస్‌లో రెండు సినిమా తెరకెక్కుతోంది. ఆ మూవీకి సంబంధించిన పనులు చూసుకుంటున్నాను. యాక్టింగ్, ప్రొడక్షన్ ఈ రెండూ నా చాలా ఇష్టం. వీటిల్లో ఏది ఎక్కువ అని చాలామంది అడుగుతుంటారు. నిజయితీగా నిజం చెప్పాలంటే నేను ఏదో ఒకదాన్ని అస్సలు ఎంపిక చేసుకోలేను. యాక్టింగ్ నా ఫ్యాషన్.. ప్రొడ్యూస్ చేయడం నేను ఎదగడానికి తోడ్పడింది. అందుకోసం నేను చాలా కష్టపడ్డాను కాబట్టి రెండు ముఖ్యంగా. నిన్న అదే రుజువైంది. మాటల్లో చెప్పకపోయినా చేతల్లో తెలిసిపోయింది. ఓ రియాలిటీ షోకు గెస్ట్‌గా వెళ్లి కెమెరా ముందు కనపడ్డాను. ఆ పక్కనే ఉన్న బిల్డింగ్‌లో ది ఎలిఫెంట్ పిక్చర్ ఆఫీసుకు వెళ్లి నిర్మాతగా వ్యవహరించాను. నా జర్నీ అంతా ఒక్కసారిగా కళ్లముందు తిరిగేసరికి మనసు సంతోషంతో ఉప్పొంగుతోంది” అని రాసుకొచ్చింది. అలాగే ఓ వీడియోను కూడా షేర్ చేసింది. దీంతో అది చూసిన నెటిజన్లు సూపర్ అని కంగ్రాట్స్ చెబుతున్నారు. అలాగే తన రెండో సినిమాలో ఆమె కీలక పాత్రలో నటిస్తోంది కావచ్చని పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

# తను పక్కన లేకుంటే నిద్ర పట్టేదికాదు



‘ఓ దశ వరకూ తల్లిదండ్రుల సహకారం ప్రతి ఒక్కరికీ అవసరమే. ఈ విషయంలో ఎవరూ మినహాయింపు కాదు..’ అంటున్నారు అందాలభామ శ్రీలీల. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన తల్లితో తనకున్న అనుబంధాన్ని వివరించారామె. అలాగే కెరీర్ పట్ల తాను తీసుకున్న కొత్త నిర్ణయాన్ని కూడా తెలియజేశారు. ‘చాలా చిన్న వయసులో నటిని అయ్యాను. ఆ టైమ్‌లో సినిమా ప్రపంచం ఎలా ఉంటుందో నాకు తెలీదు. అందుకే నాతో పాటు అమ్మ కూడా లొకేషన్‌కి వచ్చేది. అలాగే నా కథలు కూడా అమ్మే వినేది. నా సినిమాలను కూడా అమ్మే నిర్ణయించేది. ఈ కారణంగా ఆమె కెరీర్ చాలా నష్టపోయింది. ప్రస్తుతం నేను ఈ స్థాయిలో ఉన్నానంటే కారణం మా అమ్మ. కొన్ని నెలల క్రితం వరకూ కూడా అమ్మ పక్కన లేకుండా నిద్ర పోయేదాన్ని కాదు. ఇప్పుడిప్పుడే సోలో లైఫ్ అలవాటు చేసుకుంటున్నా. అది కూడా అమ్మ నిర్ణయమే. ఎప్పుడూ ఒకరిపై ఆధారపడ కూడదు అనేది అమ్మ ఫిలాసఫీ. నిజానికి ఇకపై నిర్ణయం నాదే అయినా.. ఫైనల్ డెసిషన్ మాత్రం అమ్మదే. వృత్తిపరంగా, వ్యక్తిగతంగా నా ప్రయాణాన్ని నేను చక్కబెట్టుకోవాలనేది అమ్మ ఆకాంక్ష. ఓ విధంగా మా అమ్మ నా బాధ్యతను పెంచింది.’అంటూ శ్రీలీల చెప్పుకొచ్చారు. రవితేజతో ఆమె నటించిన ‘మాస్ జాతర’ చిత్రం త్వరలో విడుదల కానుంది. అలాగే పవన్‌కల్యాణ్ ‘ఉస్తాద్ గబ్బర్‌సింగ్’లోనూ శ్రీలీలే కథానాయిక. హిందీలో కూడా ఓ సినిమా చేస్తూ బిజీగా ఉన్నాది ఈ తెలుగందం.

## నిఖిల్ వేగం పెంచాల్సిన
# టైమొచ్చింది



కనిపించడం లేదు. కార్తికేయ 2 బ్లాక్ బస్టర్ సక్సెస్ తో ప్యాన్ ఇండియా ఇమేజ్ సంపాదించుకున్నాక ఒక్కసారిగా నెమ్మదించడం అభిమానులను టెన్షన్ పెడుతోంది. 18 పేజెస్ ఓ మోస్తరుగా బాగానే ఆడినా స్పై రూపంలో దక్కిన డిజాస్టర్ కొంచెం బ్రేక్ వేసింది. ఎప్పటి నుంచో నిర్మాణంలో ఉండి లేట్ గా రిలీజయ్యింది కాబట్టి ‘అప్పుడో ఇప్పుడో ఎప్పుడో’ని కౌంట్ లోకి వేసుకోకపోయినా ఫిల్మోగ్రఫీలో ఒక ఫ్లాప్ గా మిగిలిపోయింది. వీటిని మినహాయిస్తే ఒక పెద్ద హిట్టు తర్వాత నిఖిల్ చూసిన గ్యాప్ అక్షరాలా మూడు సంవత్సరాలు. ఇప్పటిదాకా కొత్త సినిమా రిలీజ్ డేట్ రాలేదు. స్వయంభు మీద ఇండస్ట్రీ వర్గాల్లో పాజిటివ్ టాక్ నడుస్తోంది. పీరియాడిక్ సెటప్ లో చాలా పెద్ద బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. నిఖిల్ దీనికోసం కత్తిసాము, మల్లయుద్ధం లాంటివి నిజంగా నేర్చుకుని డూప్స్ లేకుండా రిస్క్ చేశాడు. కానీ ఇప్పటిదాకా విడుదల తేదీ కానీ, షూటింగ్ ఎక్కడి దాకా వచ్చిందనే కబురు కానీ ప్రొడక్షన్ హౌస్ నుంచి రాలేదు. రామ్ చరణ్ నిర్మాతల్లో ఒకడిగా వ్యవహరిస్తున్న ది ఇండియా హౌస్ కూడా నిఖిల్ కు చాలా ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్. కొన్ని వారాల క్రితం భారీ ఖర్చుతో వేసిన సెట్స్ వాటర్ ట్యాంకర్ డామేజ్ అవడం వల్ల మొత్తం కూలిపోయింది. దీంతో తాత్కాలికంగా బ్రేక్ ఇవ్వాల్సి వచ్చింది. తర్వాత నో అప్డేట్. నిన్న ఏషియన్ సంస్థ ఒక సూపర్ హీరో మూవీ చేయబోతున్నట్టు కొత్త అనౌన్స్ మెంట్ ఇచ్చింది. దర్శకుడు, టీమ్ తదితర వివరాలు చెప్పలేదు కానీ నిఖిల్ ఖాతాలో మరో ప్యాన్ ఇండియా మూవీ తోడయ్యింది. వినడానికి ఇవన్నీ బాగానే ఉన్నాయి.

## మా ఇంటి వీడియోలు సీక్రెట్‌గా తీస్తే
# ఊరుకోను
## అలియా భట్ వార్నింగ్



తన కొత్త ఇంటికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండడంపై సీరియస్ అయ్యింది బాలీవుడ్ నటి ఆలియా భట్. ఈ విషయంపై తన అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. ఇలాంటి పనులు తమ గోపత్యకు భంగం కలిగించడమే కాకుండా.. భద్రత సమస్యలను సృష్టిస్తాయని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘ పోస్ట్ పెట్టింది. ఇటీవలే ఆలియాభట్ %-% రణ్‌బీర్ కపూర్ జంట కలిసి ముంబైలో కొత్తగా ఒక ఇల్లు కట్టుకుంటుంది. ఈ ఇల్లు దాదాపు రూ.250 కోట్లతో నిర్మిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ భవనంకి సంబంధించిన వీడియోలు ఎవరో సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. దీంతో పలు న్యూస్ ఛానల్స్ కూడా ఆ విజువల్స్‌ని ప్రచురించాయి. అయితే ఈ విషయంపై సీరియస్ అయిన ఆలియా సోషల్ మీడియా వేదికగా స్పందించింది.”ముంబై వంటి మహానగరంలో నివాసాలు చాలా దగ్గరిగా ఉండటం వలన ఒకరి ఇంటి నుంచి మరొకరి ఇంటిని చూడడం సహజమే. కానీ ఇలా ఉండడం వలన ప్రైవేట్ ఇళ్లను వీడియోలు తీసి ఆన్‌లైన్‌లో పెట్టే హక్కు ఎవరికీ లేదు. అనుమతి లేకుండా ఒకరి ప్రైవేట్ స్థలాలను వీడియోలు తీయడం అనేది కేవలం ‘కంటెంట్’ కాదు, అది ఒకరి గోప్యతను ఉల్లంఘించడమే అని ఆలియా భట్ తెలిపారు. అలాగే ఈ ఘటనపై ఆలియా తన భాదను వ్యక్తం చేస్తూ.. మీడియా సంస్థలకు, తన అభిమానులకు ఒక విజ్ఞప్తి చేసింది. మీ ఇంటిలోపల నుంచి వీడియోలు తీసి మీకు తెలియకుండా బయటపెడితే మీరు ఒప్పుకుంటారా? మనలో ఎవరూ ఒప్పుకోరు కదా అంటూ ఆలియా అభిమానులను ప్రశ్నించింది. అలాగే తన ఇంటి వీడియోలు ఫోటోలు ఆన్‌లైన్‌లో కనిపిస్తే దయచేసి వాటిని ఫార్వార్డ్ చేయొద్దని, షేర్ చేయొద్దని అభిమానులను కోరింది. మరోవైపు తన ఇంటి వీడియోలను ప్రచూరించిన మీడియా సంస్థలు వెంటనే వాటిని తొలగించాలని విజ్ఞప్తి చేసింది.

# కొత్త వివాదంలో నవదీప్



నవదీప్.. వివాదం.. రెండూ విడదీయలేని పదాలు. 20 ఏళ్లకు పైగా కెరీర్లో అతడి చుట్టూ ఎన్నో వివాదాలు ముసురుకున్నాయి. నటుడిగా ఎంతో ప్రతిభావంతుడు అయినప్పటికీ.. ఈ వివాదాల వల్ల కొంతమేర తన కెరీర్ కూడా దెబ్బతింది. ఏదైనా కాంట్రవర్సీ తలెత్తినపుడు.. దాని విషయంలో నవదీప్ స్పందించే తీరు కూడా చిత్రంగా ఉంటుంది. తాజాగా అతను ఒక టీవీ రియాలిటీ షోలో ఒక కంటెస్టెంట్‌ను ఉద్దేశించిన చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారి తీశాయి. ఈసారి ‘బిగ్ బాస్’ షోలోకి కొందరు సామాన్యులు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లను తీసుకోవాలని చూస్తున్న సంగతి తెలిసిందే. అలాంటి వాళ్లను షార్ట్ లిస్ట్ చేయడం కోసం ‘బిగ్ బాస్ అగ్నిపరీక్ష’ పేరుతో ప్రత్యేకంగా ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దానికి బిగ్ బాస్ సీజన్-4 విన్నర్ అభిజిత్, బిగ్ బాస్ ఓటీటీ వెర్షన్ విజేత బిందుమాధవిలతో పాటు నవదీప్ జడ్జిగా వ్యవహరిస్తున్నాడు. ఐతే ఈ షోలో శ్రీజ అనే అమ్మాయిని ఉద్దేశించి నవదీప్‌తో పాటు యాంకర్ శ్రీముఖి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఈ షోలో ఏమైనా అన్‌ఫెయిర్‌గా జరిగిందని ఎవరైనా భావిస్తున్నారా అని శ్రీముఖి అడగ్గా.. శ్రీజ చెయ్యి పైకెత్తింది. ఆమె వెర్షన్ వినకుండానే చాల్లే కూర్చో అంది శ్రీముఖి. అనంతరం శ్రీజ వచ్చి తన వెర్షన్ చెప్పగా.. నవదీప్ చాలా వ్యంగ్యంగా స్పందించాడు. బిగ్ బాస్‌లో వందల ఎపిసోడ్లను షూట్ చేశారని.. కానీ ఇప్పుడు ఊపుకుంటూ ఊరి నుంచి వచ్చి నువ్వు అన్‌ఫెయిర్ అంటే నడవదని కామెంట్ చేశాడు నవదీప్. దానికా అమ్మాయి బాగా హర్టయింది. ఈమాత్రం దానికి పిలవడం ఎందుకు అంటూ ఆవేదనగా అక్కడి నుంచి వెళ్లిపోయింది.

## వినాయకుడికి వీడ్కోలు పలికిన విద్యార్థులు




నాచారం(ప్రశ్న న్యూస్) హబ్సిగూడ లోని హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బిజినెస్ డిగ్రీ కళాశాలలో మూడు రోజుల పాటు గణపతికి ఘనంగా పూజలు నిర్వహించిన కళాశాల సిబ్బంది, విద్యార్థులు వినాయక నిమజ్జనాన్ని వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తిని మంగళవాయిద్యాలు, కోలాటాలు, నడుమ ఊరేగింపు నిర్వహించి గణపతిని గంగమ్మ ఒడికి తరలించారు. ఈ సందర్భంగా కాలేజ్ చైర్మన్ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం, తీర్థప్రసాదాలను అందజేశారు. వినాయక నిమజ్జనం సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు ఆట పాటలతో వారు చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## డిజిటల్ యుగంలో సోషల్ మీడియా శక్తివంతమైన వేదిక

**చొప్పదండి ఎమ్మెల్యే : డాక్టర్ మేడిపల్లి సత్యం**

**యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా మండలాధ్యక్షులుగా తిరుపతి నియామకం**

**కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లో విస్తృతంగా చాటేందుకు కృషి చేస్తా**

**యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా మండలాధ్యక్షులు : సట్ట తిరుపతి**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, కొదురుపాక గ్రామానికి చెందిన సట్ట తిరుపతి యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా అధ్యక్షులుగా నియమితులైన సందర్భంగా శుక్రవారం చొప్పదండి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం ను మర్యాదపూర్వకంగా కలిసి,శాలువాతో ఘనంగా సన్మానించి,కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ, "డిజిటల్ యుగంలో సోషల్ మీడియా శక్తివంతమైన వేదిక.కాంగ్రెస్ పార్టీ ఆలోచనలు, అభిప్రాయాలను ప్రజలకు చేరవేయడంలో యువత ముందుండాలి.సమాజానికి ఉపయోగపడే విధంగా సోషల్ మీడియాను వినియోగించాలి" అని సూచించారు.అనంతరం తిరుపతి మాట్లాడుతూ ముందుగా నా నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే సత్యమన్న, యూత్ కాంగ్రెస్ జిల్లాధ్యక్షులు డాక్టర్ కౌడగాని వెంకటేష్,యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు ఏనుగుల అనిల్ కుమార్, తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని, "బోయినిపల్లి యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా మంఫలాధ్యక్షులుగా బాధ్యత అప్పగించిన పార్టీ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు. నా బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లో విస్తృతంగా చాటేందుకు కృషి చేస్తాను" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మాజీ మండలాధ్యక్షులు నాగుల వంశీ గౌడ్, తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## భాజపా రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు తొలి పర్యటన ఘనవిజయం కావాలి

**సెప్టెంబర్ 03 న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాం చందర్ రావు కరీంనగర్ తొలి పర్యటన**

**భాజపా వేములవాడ పట్టణాధ్యక్షులు : రాపెల్లి శ్రీధర్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) సెప్టెంబర్ 3న (బుధవారం) తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు రాంచందర్ రావు తొలిసారిగా కరీంనగర్ నగరంలో పర్యటించనున్నారు. ఈ పర్యటనను విజయవంతం చేయాలని వేములవాడ పట్టణ బీజేపీ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక భీమేశ్వర గార్డెన్లో నిర్వహించిన బూత్ అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో శ్రీధర్ మాట్లాడుతూ, "రాష్ట్ర అధ్యక్షుల పర్యటన కరీంనగర్‌లో పార్టీ శక్తిని మరింత బలపరిచేలా ఉండాలి. ప్రతి బూత్ అధ్యక్షుడు, కార్యకర్త ఈ కార్యక్రమాన్ని చారిత్రాత్మకంగా నిలబెట్టాలి" అన్నారు. "ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని రాంచందర్ రావు గారి పర్యటన విజయవంతం చేసేలా కృషి చేయాలి" అని పిలుపునిచ్చారు. అనంతరం ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ, "బండి సంజయ్ సూచనల మేరకు బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాష్ట్ర అధ్యక్షులు తొలిసారిగా కరీంనగర్లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భారీగా పాల్గొని విజయవంతం చేద్దాం" అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

## ఏడాది క్రితం తప్పిపోయిన విద్యార్థి..

**కేదార్‌నాథ్‌లో అస్థిపంజరంగా లభ్యం**

కోరుట్ల,: మెట్‌పల్లి మండలం రాజేశ్వరరావుపేటకి చెందిన విద్యార్థి నోముల రిశ్వంత్, ఏడాది క్రితం తప్పిపోయి, రెండు రోజుల క్రితం కేదార్‌నాథ్‌లో అస్థిపంజరంగా లభించడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

రిశ్వంత్ పంజాబ్‌లోని ఓయూనివర్సిటీలో బీటెక్ 4వ సంవత్సరం చదువుతున్నాడు. గతేడాది ఇంటి నుంచి కళాశాలకు వెళ్తున్నానని చెప్పి బయలుదేరాడు, కానీ కళాశాలకు చేరలేదు. అప్పుడు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

## బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన కోలా ఆనంద్




శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)నేడు విజయవాడలో భారతీయ జనతా పార్టీ కార్యాలయం నందు భారతీయ జనతాపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి శివ ప్రకాష్ జి రాష్ట్ర అధ్యక్షులు పివిన్ మాధవ్ రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్ జి సమక్షంలోరాష్ట్ర ఉపాధ్యక్షులుగా కోలా ఆనంద్ ప్రమాణ స్వీకారం చేసి బాధ్యత స్వీకరించారు ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ నాకు ఈ అవకాశం ఇచ్చిన కేంద్ర పెద్దలకు,రాష్ట్ర ప్రజలకు రాష్ట్ర అధ్యక్షులు పి వి న్ మాధవ్ కి రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్ జి కి ధన్యవాదాలు తెలుపుతూ వారందరికీ శ్రీకాళహస్తీశ్వర వాయు లింగేశ్వర స్వామి తీర్థ ప్రసాదములు అందజేసి సన్మానం చేయడం జరిగినది రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంతో కలిసి పేదల అభివృద్ధి కోసం పనిచేస్తూ,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యొక్క పథకాలను ప్రజలకు చేరువచేసి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ సంస్థాగతంగా బలపడడానికి నా వంతు కృషి చేస్తానని తెలియజేశారు నాతో పాటు ప్రమాణ స్వీకారం చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి కి మరియు రాష్ట్ర పదాధికారులకు శుభాకాంక్షలు మరియు అభినందనలు, అలాగేనాకు అన్ని విధాల సహకారం అందించిన తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ కి అదేవిధంగా గతంలో రాష్ట్ర మీడియా ప్రతినిధిగా,రాష్ట్ర కార్యదర్శిగా అవకాశం కల్పించిన పెద్దలందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## ఇంటి వద్దకే ముఖ్యమంత్రి సహాయనిధి



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తి పట్టణమునందు బాధితుల ఇండ్లబద్దకై వెళ్లి ముఖ్యమంత్రి సహాయ నిధిని అందించిన బొజ్జల బృందమ్మ ఈ సందర్భంగా బృందమ్మ మాట్లాడుతూ పట్టణంలో కొంతమందికి ఆరోగ్యం క్షీణించిందని వారికి సహాయం చేయవలసినదిగా శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ని కోరడం జరిగినది ముఖ్యమంత్రి వారి విన్నపాన్ని గుర్తించి ముఖ్యమంత్రి సహాయ నిధిని విడుదల చేయడం ఆ సహాయ నిధిని వారి ఇండ్ల వద్దకే వెళ్లి అందించి వారి యోగక్షేమాలు తెలుసుకోవడం జరుగుతుందని తెలియజేశారు రాష్ట్రంలో ఎన్నో ఇబ్బందులు ఉన్న ముఖ్యమంత్రి పేదవారికి ఈ రూపంలో సహాయం చేయడం చాలా సంతోషకరమని ఈరోజు పట్టణంలోని మునెమ్మకు 35814/- రూపాయలు హరి సురేష్ బాబుకు 18998/- రూపాయలు డి చెంగమ్మకు 35000/- రూపాయలు పటాన్ భాషా కు 44,422/- వి బాల వెంకట సుబ్రహ్మణ్యం కు 39438 /- రూపాయలు అల్లం మానసకు 9,94,192/- రూపాయలు మొత్తం 11,67,864/- రూపాయలు ఇవ్వడం జరిగిందని తెలియజేశారుఅలాగే మా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ సంవత్సర కాలంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం నందు 147 మంది బాధితులకు 1,78,76,702/- అందించామని అలాగే మహిళలకు ఎన్నో మంచి కార్యక్రమాలు ముఖ్యమంత్రి చేస్తున్నాడని ఆంధ్ర రాష్ట్రంలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్ పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్ ,తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంఠ రమేష్,గాదిపాకల గోపీనాథ్ ,షాకీర్ అలీ, గుర్రపు శెట్టి, మునికృష్ణ ,ఖాదర్బాషా, కరీం,అస్మత్,వెంకటేష్ చౌదరి, సి ఎస్ మస్తాన్,రేణుకమ్మ , మల్లీశ్వరమ్మ,షఫీ, అమరావతి,అమ్మ, హేమంత్ నింద్ర సుధాకర్ ,గుత్తా విజయ్ కుమార్, రాకేష్, బాలాజీ , లెనిన్ బాబు,సతీష్, లోకేష్, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహాశక్తి గణపతికి పూజలు



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తిలోని పుర వీధుల్లో ఉన్న మహా శక్తి గణపతి వేడుకల్లో మూడో రోజు కావున భక్తులు అధిక సంఖ్యలో వచ్చి గణనాథుడికి తీర్థ ప్రసాదాలు ధూప నైవేద్యాలు సమర్పించారు వాడవాడల గణనాథుని విగ్రహాలు ఆయా కమిటీ సభ్యులు వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు.ప్రత్యేక పూజలతో కోలాటంగా మారాయి శ్రీకాళహస్తిలో విఘ్నేశ్వరుడు వివిధ రూపాల్లో కొలువైఉన్న గణనాథుడే యుగపురుషుడై వచ్చి నేడు సనాతన ధర్మాలను కాపాడాలని ఇలాంటి కాన్సెప్ట్ ను ఎంచుకున్నామని భక్తులు తెలియజేశారు. ప్రకృతి ప్రేమికులైన తాము మట్టి గణపతులానే పూజిస్తున్నామని మట్టి గణపతులను వాడి భావితరాలకు,ఎటువంటి కలుషితం లేని స్వచ్ఛమైన ప్రకృతిని అందజేయాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## వేములవాడలో విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

**ఎరువుల దుకాణాల్లో రికార్డుల పరిశీలన**

**- అక్రమ నిల్వలకు హెచ్చరిక**

**అక్రమ నిల్వలు వద్దు - కృత్రిమ కొరతను సృష్టించవద్దు**

**సర్కిల్ ఇన్స్పెక్టర్ : ఎన్. అనిల్ కుమార్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణంలో శుక్రవారం విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎరువుల దుకాణాల్లో యూరియా, కాంప్లెక్స్ ఎరువుల బస్తాల నిల్వలు, రికార్డులు సమీక్షించారు. గోదాముల్లో ఎరువులు సక్రమంగా ఉన్నాయో లేదో కూడా పరిశీలించారు.ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్. అనిల్ కుమార్ మాట్లాడుతూ, అన్ని డీలర్లు ఎఫ్.సి.ఓ. -1985 చట్టం ప్రకారం ఎరువుల విక్రయాలు జరపాలని సూచించారు. రిజిస్టర్లు సక్రమంగా వ్రాయడం, రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వడం వంటి నిబంధనలు పాటించాలని ఆదేశించారు. అక్రమ నిల్వలు ఉంచకూడదని, కృత్రిమ కొరత సృష్టించరాదని స్పష్టం చేశారు. ఈ తనిఖీలలో విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ కరీంనగర్ అధికారులు, మండల వ్యవసాయ అధికారి సాయి కిరణ్,ఎస్. వెంకట్ రెడ్డి (%ూ+%), హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, పోలీస్ కానిస్టేబుల్ సంపత్ పాల్గొన్నారు.

## తెగులు నియంత్రణకు రైతులు జాగ్రత్తలు పాటించాలి

**మండల వ్యవసాయ అధికారి : సాయి కిరణ్**

**వేములవాడ మండలంలో పత్తి - వరి పొలాల పరిశీలన**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ మండలంలోని కాషాయపల్లి, హన్మక్కపల్లి, వేములవాడ గ్రామాలలో పత్తి, వరి పంటల పరిస్థితిని వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు.పత్తి పంటలో మురుగు నీరు తొలగించాల్సిన అవసరాన్ని గుర్తుచేసి, వేరుకుళ్ళు తెగులు నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 600 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. అదేవిధంగా పంట పెరుగుదలకు మల్టీ కె (13-0-45) ఎకరానికి 1 కిలో పిచికారీ చేయాలని తెలిపారు.వరి పంటలో అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోలు 120 గ్రాములు, అలాగే బాక్టీరియా తెగులు నివారణకు స్ట్రెప్టోమైసిన్ 20 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు.

**జాగ్రత్తలు**

పొలాలలో విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలి.

వర్షం ఉన్న రోజుల్లో పురుగు మందులు పిచికారీ చేయకూడదు.

ఈ పరిశీలనలో మండల వ్యవసాయ అధికారి సాయి కిరణ్, వ్యవసాయ విస్తరణ అధికారి రాజు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## అక్రమ బోర్లను అరికట్టేది ఎప్పుడు



సికింద్రాబాద్(ప్రశ్న న్యూస్) గతంలో అధికారుల కళ్లుగప్పి సెలవు దినాలలో బోరులు వేయడం ఆనవాయితీగా ఉండేది. కానీ ప్రస్తుతం పనిదినాలలోనే యథేచ్ఛగా బోర్లు వేయడం వాటికి కొంతమంది అధికారులు, నాయకులు కూడా అండగా నిలుస్తుండడం శోచనీయం. అదే కోవలో మారేడ్ పల్లి మండలం పరిధిలోని టీచర్స్ కాలనీలో రెండు రోజుల పాటు అనగా గురువారం ఉదయం ప్రారంభించిన బోర్ శుక్రవారం మధ్యాహ్నం వరకు కొనసాగినా అడ్డుకునే వారే లేకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐతే ఈ బోరుకు అనుమతులు ఉన్నాయని చెబుతుండడం అనేక విమర్శలకు తావిస్తోంది. పేద ప్రజలు తమ అవసరాల కోసం 4ఇంచుల బోరు వేస్తేనే అడ్డుకునే రెవెన్యూ అధికారులు ఈ బోరు విషయం పట్టించుకోక పోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కి 6.5ఇంచుల బోరు 300మీటర్లకు పైగా లోతులో వేసిన ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక రెవెన్యూ శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారో లేక మరి కొంతమంది ఇలాంటి బోర్లు వేసి భూగర్భజలాలు అడుగంటి పోడానికి దోహదపడతారో వేచిచూడాలి.

## విద్యార్థుల్లో హరితవనం చైతన్యం పెంపుకు అధ్యాపకులు అంజయ్య కృషి

**సామాజిక బాధ్యతతో జడ్పీ హైస్కూల్ కు పనిముట్లు అందజేత**




వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. పాఠశాల తోట అభివృద్ధి కోసం అవసరమైన పనిముట్లను బహూకరించారు.వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా సేవలందిస్తున్న వేషాల అంజయ్య సామాజిక బాధ్యతలో భాగంగా ఒక గడ్డపార, రెండు తట్టలు, రెండు చెక్క పారలను పాఠశాలకు అందజేశారు.విద్యార్థులలో తోటలపై అవగాహన పెంచడం, పాఠశాల ప్రాంగణాన్ని హరితవనం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు అంజయ్య తెలిపారు. "పాఠశాలలో హరిత వాతావరణం ఉంటే విద్యార్థుల్లో సహజసిద్ధమైన ప్రకృతి ప్రేమ పెరుగుతుంది. అందుకే ఇలాంటి చిన్న సహకారం సమాజంలో పెద్ద మార్పుకు దారి తీస్తుంది" అని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారత్నం, ఫిజికల్ డైరెక్టర్ హమీద్, ఉపాధ్యాయులు మల్లేశం, కోటేశ్వర్, సతీష్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ పాఠశాల ప్రాంగణాన్ని పచ్చదనంతో నింపాలని సంకల్పం వ్యక్తం చేశారు.

# ట్రాఫిక్ సమస్యలను గాలికి వదిలేసిన నల్లకుంట ట్రాఫిక్ పోలీసులు

- వాహనాల తనిఖీలు, ఫోటోలకే పరిమితమైన పరిస్థితి
- రోడ్లు, ఫుట్ పాత్ కబ్జాపై కన్నెత్తి చూడని ఎస్ఐలు, ఉన్నత అధికారులు
- లాలాపేట అంబేద్కర్ విగ్రహం వద్ద ట్రాఫిక్ సమస్య పట్టించుకోరా.?
- సిబ్బంది ఫుట్ పాత్ వ్యాపారులతో కుమ్మక్కై నారా.? యదేచ్చగా ఫుట్ పాత్ వ్యాపారాలు
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఉపయోగించే వాహనాలు కాలక్షేపానికేనా.?





**తార్నాక(ప్రశ్న న్యూస్)** నల్లకుంట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకీ తీవ్రమవుతున్నాయి. వాహనాల తనిఖీలకు అధికారులు, ఫోటోలకు సిబ్బంది పరిమితై ట్రాఫిక్ జామ్ లను, ఫుట్ పాత్, రోడ్ల ఆక్రమణ పూర్తిగా గాలికి వదిలేసారని వాహనాదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తార్నాక, లాలాపేట్ వరకు, తార్నాక చౌరస్తా నుండి హబ్సిగూడ వరకు ఫుట్ పాత్ ల కబ్జా జరగడంతో పాటు రోడ్లపై ఇస్తా రాజ్యాంగ వాహనాలు పార్కింగ్ చేస్తున్న అసలు పట్టించుకోవడంలేదని స్థానికులు మండిపడుతున్నారు. ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం కాదు కాదు బాధ్యతారాహిత్యం ఎంత తారస్థాయికి చేరిందంటే చివరికి మణికేశ్వర్ నగర్ బస్ స్టాప్ లో పండ్ల వ్యాపారం, ప్రైవేట్ వాహనాల పార్కింగ్ నిత్యం ఉంటున్నాయి దానితో ఆర్టీసీ బస్సులు వెళ్లకుండా పరిస్థితి ఉండడంతో ఆర్టీసీ వాహనాలను రోడ్లపైనే ఆపి ప్రయాణికులను దించుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు మాత్రం చూసుకుంటూ వెళుతున్నారు తప్ప వాటిపై చర్యలు తీసుకోకపోవడం వెనక నెల నెల మామూళ్లే కారణమని వాహనా దారులు ఆరోపిస్తున్నారు. ఒక బస్టాప్ లో అక్రమంగా నిర్వహిస్తున్న వాహనాలను పండ్ల బండ్లను శాశ్వతంగా తొలగించడం లేదంటే ఇక డ్యూటీ ఎంత బాగా చేస్తున్నారో ఉన్నత అధికారులకే తెలియాలి. వాహనాల తనిఖీలు చేయడం ఫోటోలు తీయడమే ప్రధాన డ్యూటీ నా.? లేకుంటే ట్రాఫిక్ సమస్యను తీర్చడం ప్రధాన డ్యూటీనా అర్థం కాని పరిస్థితి నెలకొన్నది. అధికారులకు ఎప్పుడు ఈజీగా ఉండే పనులు తప్ప ట్రాఫిక్ తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు తొలగించాలి ట్రాఫిక్ సమస్య ఉన్న దగ్గర సరైన సిబ్బందిని నియమించాలన్న చిత్తశుద్ధి అధికారులకు లేకపోవడం బాధాకరంగా మారింది. ఇక లాలాపేట అంబేద్కర్ విగ్రహం వద్ద వాహనాలు నిత్యం జామ్ మై బ్రిడ్జి పైన లాలాపేట వైపు నిలిచిపోయి ట్రాఫిక్కు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి అక్కడ ట్రాఫిక్ పోలీసుని పేరుకు నియమించారు అతను అక్కడ కాలక్షేపం చేయడం తప్ప ట్రాఫిక్ ని నియంత్రించడం లేదని వాహనాదారులు మండిపడుతున్నారు. ఇక సాయంత్రం వేళలో అంబేద్కర్ విగ్రహం వద్ద ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంటుందని దానితో వాహనాలు బారులుగా తీరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సై స్థాయి అధికారులు అసలు విధులు నిర్వహిస్తున్నారా.? కాలక్షేపం చేస్తున్నారా.? అర్థం కాని పరిస్థితి. కేవలం వాహనాల తనిఖీలలో ఎస్సైలు కనిపించడం తప్ప ట్రాఫిక్ సమస్యలను తీర్చడంలో ఎక్కడ కనిపించడం లేదని వాహనాదారులు మండిపడుతున్నారు. తార్నాక చౌరస్తాలో మాత్రం ఇరువైపులా ఫుట్ పాత్ లు కొబ్బరి బోండాల వ్యాపారాలు సంవత్సరాల కొద్ది నడుస్తున్నాయి ట్రాఫిక్ పోలీసులకు వ్యాపారస్తులకు మంచి ఆర్థిక లావాదేవీలు ఉండడంవల్లే వాళ్ళని ఒక్కరోజు కూడా తొలగించిన పాపాన పోలేదు. అయిన నెలల కావలసిన ది అధికారులకు వస్తుంటే ఎందుకు తొలగిస్తారని పోలీస్ శాఖలో అవినీతి లంచాలు లేవని ఉన్నతాధికారులు చెప్పడం తప్ప వాస్తవం లేదని ఎందుకంటే ఫుట్ పాత్ వ్యాపారుల నుండి వసూలు చేయకుంటే వాటిని తొలగించే వారని వాటిని తొలగించడం లేదంటే అధికారులకు కావలసిన మామూళ్లు వస్తున్నాయని వాహనాదారులు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా నల్లకుంట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై ల, నిర్లక్ష్యంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు జఠిలమవుతుంది. ఇప్పటికైనా ఉన్నత అధికారులు వాహనాల తనిఖీలు ఫోటోలు తీయడం మే ప్రధాన డ్యూటీ గా కాకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, చౌరస్తాల వద్ద ట్రాఫిక్ పోలీసులను నియమించి ట్రాఫిక్ కు ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యతను మరొకసారి గుర్తు చేసుకుని ప్రజల సమస్యలు తీరుస్తారని ఆశిద్దాం.

# సొంత జిల్లాలో రేవంత్ రెడ్డికి బిగ్ షాక్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పాలమూరు రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సొంత ప్రాంతం నుంచే వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నుంచి ఓటమి పాలైన రేవంత్ రెడ్డికి, ఇప్పుడు గద్వాలలో కూడా భారీ షాక్ తగిలింది.

### గద్వాలలో కాంగ్రెస్‌కు భారీ ఎదురుదెబ్బ

గద్వాల మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. గురువారం నాడు తన నిర్ణయాన్ని ప్రకటించిన ఆయన, త్వరలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరనున్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ 6 లేదా 10వ తేదీన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సమక్షంలో ఆయన గులాబీ కండువా కప్పుకోనున్నారు. ఆశ్చర్యకరంగా, కేశవ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ కౌన్సిలర్లు, నాయకులు కూడా పార్టీని వీడనున్నారు.

### పాలనలో రేవంత్ రెడ్డి వైఫల్యం..

ఈ సందర్భంగా బీఎస్ కేశవ్ మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని, పాలనలోనూ ఫెయిల్ అయ్యారని తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో తమకు, తమ కార్యకర్తలకు సరైన గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు ఇక భవిష్యత్ లేదని, అందుకే పార్టీని వీడుతున్నట్లు స్పష్టం చేశారు.

### ఏడాదిలోనే యూటర్న్..

గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో 18 మంది మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన బీఎస్ కేశవ్, ఏడాది తిరగకుండానే తిరిగి బీఆర్‌ఎస్‌లోకి వెళ్తుండటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇది రేవంత్ రెడ్డి, జూపల్లి కృష్ణారావుకు వ్యక్తిగతంగా, రాజకీయంగా పెద్ద ఎదురుదెబ్బ అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

### నడిగడ్డలో ఆసక్తికర పరిణామాలు

గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అనర్హత వేటులో పదవి కోల్పోయే ప్రమాదం ఉండటం, తిరిగి గద్వాలలో బీఆర్‌ఎస్ గెలిచే అవకాశం ఉండటంతో నడిగడ్డ రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారాయి. ఈ పరిణామాలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చేదు ఫలితాలు కలిగించే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. మొత్తానికి, పాలమూరులో రేవంత్ రెడ్డికి గడ్డు పరిస్థితులు తప్పేలా లేవని ప్రస్తుత పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి.



# సిగ్మా హాస్పిటల్లో పేషెంట్ చనిపోయిన ఘటనపై దర్యాప్తు జరపాలి

## నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్

- చనిపోయిన కుటుంబాన్ని పరామర్శించిన ఎన్ హెచ్ ఆర్ సి బృందం
- చనిపోయిన బైరి లక్ష్మణ్ కుటుంబానికి న్యాయం జరగాలి అంటున్న ప్రజా సంఘాలు
- డిఎంహెచ్ ఓ బాధ్యతారహిత్యంతో ప్రైవేట్ ఆసుపత్రుల అవినీతి దందాలు
- జిల్లా వైద్యాధికారుల కనుసైకగల్లోనే అక్రమ ఆసుపత్రుల నిర్వహణ

**జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్)** జగిత్యాల గొల్లపల్లి రోడ్డులో గల సిగ్మా హాస్పిటల్ లో రాయికల్ కు చెందిన బైరి లక్ష్మన్ హాస్పిటల్ యాజమాన్యం సిబ్బంది యొక్క నిర్లక్ష్యం వల్ల చనిపోయిన విషయం తెలిసిందే. 2025 ఆగస్టు 18న జగిత్యాల లోని సిగ్మా హాస్పిటల్ లో రాయికల్ కు చెందిన బైరి లక్ష్మన్ అడ్మిట్ చేయడం జరిగిందని తెలిపారు. అడ్మిట్ అయినప్పుడు హాస్పిటల్ వైద్యులు పేషెంట్ సీరియస్ గా ఉన్నారని చెప్పి హాస్పిటల్లో అడ్మిట్ చేసుకున్నారని, పేషెంట్ కి ఆరోగ్య శ్రీ అప్రూవల్ కొరకు రెండు రోజులు ఎలాంటి ట్రీట్మెంట్ చేయకుండా ఆరోగ్యశ్రీ అప్రూవల్ వచ్చేవరకు అలాగే ఉంచారు ఆ తరువాత రెండు రోజులు ట్రీట్మెంట్ కు సంబంధించిన మిషన్ పనిచేయడం లేదని మరలా రెండు రోజులు అలాగే ఉంచారని తెలిపారు. శనివారం రోజున అనగా 2025 ఆగస్టు 23 తేదీన పేషంటు చనిపోయాడని పేషెంట్ కుటుంబ సభ్యులకు తెలియజేశారని తెలిపారు. అంటే సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుండి శనివారం మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంచుకున్నారని బైరి లక్ష్మణ్ కుటుంబ సభ్యులు నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్జీవో (ఎన్ హెచ్ ఆర్ సి) సభ్యులకు తెలియజేశారని తెలిపారు. అసలు హాస్పిటల్లో ఏం జరిగింది, అసలు ట్రీట్మెంట్ చేసిన డాక్టర్ ఎవరు, పేషంటు ఎందుకు చనిపోయారు ఈ సంఘటనపై తగు విధమైన దర్యాప్తు చేసి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని తెలియజేశారు. అందుకుగాను ఎన్ హెచ్ ఆర్ సి ఎన్జీవో సభ్యులు ఈ సంఘటనపై తగిన దర్యాప్తు జరిపించి, సిగ్మా ఆసుపత్రిపై తగిన చర్యలు తీసుకోవాలని, వారి కుటుంబ సభ్యులకు తగిన న్యాయం జరిపిస్తామని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్జీవో సంస్థ వారు ఆ కుటుంబం సభ్యులను పరామర్శించి ఓదార్చడం జరిగినదని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్జీవో చైర్మన్ ఐలనేని శ్రీనివాసరావు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నక్క గంగారం, నేషనల్ కన్వీనర్ జగదీష్, తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ప్రభాకర్, జగిత్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పం చిన్నారెడ్డి, జగిత్యాల జిల్లా జనరల్ సెక్రెటరీ ప్రకాష్, జగిత్యాల పట్టణ అధ్యక్షులు దేవ్ సింగ్ రాథోడ్, జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ సంగేపు ముత్తు, జగిత్యాల జిల్లా జనరల్ సెక్రెటరీ తునికి రాజేష్, కోరుట్ల పట్టణ ఉపాధ్యక్షులు అల్లరి నరేష్ తదితరులు పాల్గొన్నారని తెలిపారు.






### లాఠీచార్జీ ఘటనపై నివేదిక కోరిన

# మానవ హక్కుల కమీషన్




**బడంగ్ పేట్ (ప్రశ్న న్యూస్)** గత సంవత్సరం అక్టోబర్ లో సికింద్రాబాద్ పరిధిలోని కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహం ద్వంసం చేసిన సంఘటనలో నిరసన వ్యక్తం చేసిన భక్తులపై లాఠీచార్జీ ఘటనపై రాష్ట్రీయ వానరసేన జాతీయ అధ్యక్షుడు శ్రీ నాం రామ్ రెడ్డి మానవ హక్కుల కమిషన్ చేసిన ఫిర్యాదు పై స్పందించిన కమీషన్ మహంకాళి డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కు ఈ సంఘటనపై నవంబర్ 3 లోపు నివేదిక సమర్పించాలని నోటీసు జారీ చేసింది. ఈ క్రమంలో ఈ కేసు నవంబర్ 3న ఉదయం 11 గంటలకు కమిషన్ ముందు విచారణకు వస్తుందని, ఇది రాష్ట్రీయ వానరసేన పోరాటం ఫలితంగా సాధించుకున్న ప్రజల విజయమని, ప్రజల హక్కుల కోసం అహర్నిశలు మా ఉద్యమం కొనసాగుతుందని రాష్ట్రీయ వానరసేన సభ్యులు హర్షం వ్యక్తం చేసారు.

# టిడిపి కూటమిపై తేల్చేసిన పవన్..



**విశాఖపట్నం (ప్రశ్న న్యూస్):** ప్రతి రాజకీయ పార్టీ నేతకు ఒక వ్యూహం ఉంటుంది. ఎవ్వరినీ తక్కువ అంచనా వేయకూడదు కూడా. అయితే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చాలా తక్కువగా అంచనా వేసింది. ఆయనకు అసలు రాజకీయాలే తెలియని జగన్మోహన్ రెడ్డి నుంచి కిందిస్థాయి వైసీపీ నేత వరకు.. అంతా భావించారు. కానీ అదే పవన్ కళ్యాణ్ వ్యూహాలు చూస్తుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి నిద్ర పట్టడం లేదు. గత ఎన్నికలకు ముందు టిడిపి తో పొత్తు ప్రకటించారు పవన్ కళ్యాణ్. కానీ వైయస్సార్ కాంగ్రెస్ చాలా తేలిగ్గా తీసుకుంది. రెండు పార్టీలు కలిసినా పర్వాలేదు. ఆ రెండు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు విషయంలో గొడవలు వస్తాయి అని భావించారు. కానీ సీట్ల సర్దుబాటు సక్రమంగా జరిపించారు పవన్. కాస్త వెనక్కి తగ్గి తమ బలానికి తగ్గట్టు సీట్లు తీసుకున్నారు. ఓట్లు బదలాయింపు జరగదని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భావించింది. కానీ రెండు పార్టీల మధ్య ఓట్ల బదలాయింపు జరిగింది. పోనీలే మంత్రి పదవిలో దెబ్బలాడుతారు అని భావించారు. మంత్రి పదవుల విషయంలో సవ్యంగా ముందుకు సాగారు. తప్పకుండా రెండు పార్టీల శ్రేణులు మధ్య గొడవలువస్తాయి అని అంచనా వేశారు. కానీ 15 నెలల ప్రయాణం సవ్యంగా సాగిపోయింది...

### మరో 15 ఏళ్లు కూటమి..

మరో 15 ఏళ్ల పాటు కూటమి ఉంటుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెప్పారు. విశాఖలో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలోనే పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. కూటమి అనేది రెండు పార్టీల ప్రయోజనాలకు కాదని.. ఈ రాష్ట్రానికి అని..అంతకుమించి ఈ దేశానికి అని ప్రకటన చేశారు పవన్. అందుకే కూటమి వెచ్చిన ప్రయత్నంలో జనసైనికులు భాగం కావద్దని తేల్చి చెప్పారు. తద్వారా పూర్తి స్పష్టతనిచ్చారు. కూటమి విషయంలో.. తెలుగుదేశం పార్టీతో పొత్తు విషయంలో.. మరో మాటకు తావు లేదని తేల్చి చెప్పారు పవన్. ఎట్టి పరిస్థితుల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వకూడదని కూడా చెప్పుకొచ్చారు. కేవలం పార్టీ శ్రేణులకు కీలక సూచనలు చేసేందుకే.. ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు స్పష్టం అవుతోంది.

### వైసిపి అంచనాలు తారుమారు...

పవన్ కళ్యాణ్ తో పాటు జనసైనికులు టిడిపి పట్ల దూకుడు ప్రదర్శిస్తారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అంచనా వేసుకుంది. తద్వారా కూటమి విచ్ఛిన్నం అవుతుందని.. అదే జరిగితే తమకున్న సంప్రదాయ ఓటు బ్యాంకుతో అధికారంలోకి రావచ్చన్నది వైసిపి అంచనా. కానీ ఆదిలోనే దీనిని గుర్తు ఎరిగారు పవన్ కళ్యాణ్. జనసైనికుల్లో పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కావాలన్న అభిమతం ఉంది. ఈ క్రమంలో జనసైనికుల్లో ఒక రకమైన గందరగోళం ఏర్పరిచేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రయత్నించింది. సోషల్ మీడియా ముసుగులో.. పవన్ అభిమానుల ముసుగులో.. జనసైనికుల ముసుగులో చాలా రకాల ప్రయత్నాలు చేసింది. కానీ దానిని ఎప్పటికప్పుడు అధిగమించారు పవన్ కళ్యాణ్. తప్పుడు ప్రచారాలతో పాటు ప్రకటనలపై ఫుల్ క్లారిటీ ఇస్తున్నారు. అలా చేస్తున్న ప్రచారాల వెనుక వైసీపీ హస్తం ఉందని కూడా పార్టీ శ్రేణులకు పూర్తిస్థాయిలో స్పష్టతనిస్తున్నారు. దీంతో పార్టీ శ్రేణులు కూడా అసలు విషయాన్ని గ్రహిస్తున్నాయి. కొంతవరకు నియంత్రణలోనే ఉంటున్నాయి.

### అటువంటి నేతలకు చెక్..

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఉడుంపట్టుతో ఉన్నారు. టిడిపిని వ్యతిరేకించే జనసేన బ్యాచ్ ఉండేది. వారిని నియంత్రించడంలో పవన్ సక్సెస్ అయ్యారు. అయితే సహించుకోలేని నేతలు బయటకు వెళ్లిపోయారు. మరికొందరినీ పవన్ బలవంతంగానే బయటకు పంపించేశారు. ఇప్పుడు జనసేన అంటే పవన్ ఆదేశాలను పాటించే ఒక సైన్యం. ఈ విషయంలో ఎమ్మెల్యేలకు సైతం మినహాయింపు లేదు. అందుకే కూటమి మరో 15 సంవత్సరాల పాటు ఉండాలని కోరుకుంటున్నారు. దానికి అడ్డుపడితే సహించేది లేదని హెచ్చరిస్తున్నారు. ఇష్టం లేకపోతే బయటకు వెళ్ళిపోవచ్చు అని కూడా సంకేతాలు ఇస్తున్నారు పవన్. మొత్తానికైతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోరుకున్న మాదిరిగా జరిగే పరిస్థితి లేదు. అక్కడ పవన్ తనకంటూ ఒక వ్యూహంతో ముందుకు సాగుతున్నారు..

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588